AL - HILAL

నెలవంక

మాసపత్రిక

Vol 5 Issue: 16 January - 2008

مجلة الهلال - ملحق مجلة البشرى (باللغة التلغوية)



ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం

భారత రిపబ్లిక్ దే

ముఖ సంచికలో

ప్రత్యేక వ్యాసం (3 వ పేజీలో)

IPC

ISLAM PRESENTATION COMMITTEE

NELAVANKA
(Al-Hilal)
Monthly

CHIEF PATRON
Muhd. Ismail Al-Ansari

CHIEF EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Shaikh Abdus Salam Omeri
Tahera Begum

Design
Noushad Zainulabdeen

PUBLISHED BY
Islam Presentation committee
Kuwait

PHONES
2444116 , 2444117
Extns :
110 Azeezur Rahman
151 Mujahid khan Omeri

FAX
2400057

EMAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O. Box-1613
Safat-13017, KUWAIT









ఈ సంచికలో....

ఇండియా దటీజ్ భారత్	3
హిజ్రత్...హిజ్రత్	4
ఆ దేవుడు ఒక్కడే	6
పవిత్ర జీవితం	8
హజ్రత్ జువైరియా బిన్త్ హారిస్ (ర.అన్హా)	9
ఖుర్ఆన్ పాఠం	10
తమ తప్పులెరుగు వారే ధన్యులు	11
రమజాన్ పోటీలు	12
ఇస్లాం శిక్షణ	13
ముహర్రమ్ పదవ రోజు వాస్తవికత	14
ఈదుల్ అజ్హా విశేషాలు	17
భ్రమల వలయం	18
భగవంతుని కుమారుడా ఏసు?	19

الفهرس

بمناسبة يوم جمهورية الهند	3
مقاصد الهجرة	4
هو الله أحد	6
الرحيق المختوم (الاسراء والمعراج)	8
الامهات الخالدات (السيدة جويرية رضى الله عنها)	9
درس القرآن (سيرة ابراهيم عليه السلام)	10
من هو السعيد ؟ (درس الحديث)	11
المسابقة الرمضانية (أخبار اللجنة)	12
تربية المهتدين	13
شهر الله المحرم : رسالته وآدابه	14
حفل عيد الأضحى المبارك للمهتدين والجاليات	17
كيف تنشأ البدع والخرافات	18
هل عيسى عليه السلام ابن الله (بقلم صحافي هندي)	19

PAGE 1-20.pdf 1/9/08 8:41:33 PM



నెలవంక ఉత్తరాలు



రాజకీయ అవగాహన కూడా అవసరమే

గౌరవనీయులైన నెలవంక సంపాదక వర్గానికి నా హృదయాంజలి.

నవంబరు సంచిక ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలతో, ఎంతో ముచ్చటైన ముఖచిత్రంతో వెలువడింది. ముఖచిత్రం ఎంత అందంగా ఉందో అందులోని అంశాలు కూడా అంతే ఆనందింపజేశాయి. **'మరువబోకుమా!'** సంపాదకీయంలో నాటి మహనీయులు ఏం చెప్పారో మరొక్కసారి మననం చేసుకో తెలుగోడా! అని చక్కగా సందేశమిచ్చారు. **"అర్ధ శతాబ్ది ఆంధ్రప్రదేశ్ -ఒక చూపులో"** అని చెబుతూనే ప్రతి దశాబ్దిలో జరిగిన రాజకీయ పరిణామాల్ని కూలంకుషంగా అవగాహన కల్గే విధంగా కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు. ఆంధ్రులమై ఉన్న మనకు ఆంధ్ర రాష్ట్ర అవశ్యకత ఏమిటో ఎలా సంపూర్ణాంధ్ర ప్రదేశ్ ఏర్పడిందో వివరంగా తెలియజేసినందులకు సంపాదకులకు మరొక్కసారి కృతజ్ఞతలు.

"మీరు గనక విద్యార్థులైతే" లో ఎస్.ఎం.మలిక్ గారు ఖుర్‌ఆన్ అధ్యయనం చేయవలసిన రీతిని - సుతిమెత్తగా చురకలు పెడుతూ మరీ- వివరించారు. మనిషికి రాజకీయ అవగాహన ఎంతైనా అవసరం. మానవుడు సంఘజీవి. ఇలా రాజకీయం నుండి ముందుకు సాగుతూ **"ఇస్లాం కత్తిబలంతో వ్యాపించిందా?"** అనే వ్యాసం ద్వారా పాఠకులను ఆలోచనలో పడవేశారు. ఈ వ్యాసం ఇస్లాం గొప్పదనాన్ని చాటి చెప్పేదిగా ఉంది. మహాప్రవక్త(స) వారికి కలిగిన మనోవేదనకు అద్దం పట్టింది **"విషాద సంవత్సరం". 'ధర్మనిష్ఠకు గీటురాయి'** లోని హదీసులు, అందులోని హృదయచిత్రపటం చూస్తేనే -ఒక్క చూపులో- అర్థమైపోతున్నాయి.

ఇకపోతే ఇస్లాం **'విశ్వజనీన ధర్మం'** ఎందుకు? ఎలా? అంటూ ఎస్.ఎం. రసూల్ గారిచ్చిన వివరణ చక్కగా ఉంది. **"దైవ విధేయులుగానే బ్రతకండి, దైవవిధేయులుగానే చావండి"** అంటూ అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు విశ్లేషించిన విధం అద్భుతం. కబ్జ్‌లో అందరూ కలసి పండుగ సంబరాలు చేసుకున్న విధం కన్నుల పండువగా ఉంది. **'భ్రమల వలయం'** అనే అబ్దుస్సలాం గారి వ్యాసం కొత్త శీర్షికలా అనిపించింది. సామాన్య జనుల భ్రమలు బాగా వివరించారు. అయితే విద్యావంతుల భ్రమలు, పండితుల భ్రమలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలన్న ఆసక్తి ఉంది. ఇదే విధంగా ఉగ్రవాదం, నీతి బాహ్యత నీలినీడల్లో యువత ఎలా నిర్వీర్యమైపోతుందో తెలియజేసే శీర్షిక ఒకటి మొదలెడితే బావుంటుంది. చివరి పేజీలో మహనీయ ముహమ్మద్(స) వారి ప్రబోధనను భావగర్భితమైన చిత్రంలో చిత్రీకరించారు. తొలి నుండి తుది దాకా ఎంతో రసవత్తరంగానూ, సందేశాత్మకంగానూ సాగింది మన నెలవంక రథం. ఇలాగే వినూత్న పంథాలో, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకుపోవాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను.

– ఎం.డి. అమీన్
(ఫహీల్)

ఖుర్‌ఆన్ వాక్యాల మూలంగా నెలవంక ప్రతిష్ఠ పెరిగింది

ప్రధాన సంపాదకులకు కృతజ్ఞతలు. ఈ నెలవంక ద్వారా అద్భుతమైన వ్యాసాలను నెలనెలా మా ముందుకు తెస్తున్నందుకు అభినందనలు తెలుపుకుంటున్నాను. జీవనోపాధి కోసం వచ్చిన మాలాంటి వాళ్లకు ఓ కాంతి కిరణం ఈ నెలవంక. ఇన్షాఅల్లాహ్ నిజంగా ఆ పరమ ప్రభువు మా కోసం పంపిన ఓ చిరు కానుక ఈ మా నెలవంక. ఇలాంటి చిరుపుస్తకం నేను ఎక్కడా చూడలేదు. చదవలేదు కూడ. ఇస్లాం ధర్మం గూర్చి ఖుర్‌ఆన్‌లో వున్న అల్లాహ్ వాక్యాలను గూర్చి, వ్రాయబట్టేనేమో దీని గౌరవప్రతిష్టలు పెరిగాయి ఈ పుస్తకానికి. అజీజుర్రహ్మాన్ గారు దృక్పథంలో వివేచనను విడనాడకండి అంటూ వ్రాసిన వ్యాసం చాలా బాగుంది. అదే విధంగా **'దేవుడున్నాడండీ'** అని శాంతిప్రియ గారు, తల్లిగర్భంలో శిశువుదాల్చిన రూపంతో సహా బొమ్మలు వేసి మరి వివరించారు. హబీబ్ గారు డబ్బును గూర్చి చాలా చక్కగా వ్రాసారు. డబ్బు విలువ ఏంటి, దాన్ని ఎలా సంపాదించాలి, ఏ విధంగా ఖర్చుపెట్టాలి తెలిపారు.

'ఒరే చంటి' అబూ హామిద్ గారు పిల్లలను ఎలా పెంచాలి, పిల్లలను ఏ విధంగా తీర్చిదిద్దాలో వివరించారు. నిజంగా ఆ వ్యాసం చదువుతున్నంత సేపు నాకైతే ఇప్పుడే వెళ్ళి మా పిల్లలకు ఈ నెలవంక పుస్తకం వాళ్ళతో చదివించాలనిపించింది. అంతే కాదు, వాళ్ళను కూడా దైవమార్గంలోకి పిలవాలని కుతూహలం కలుగుతుంది. నిజంగా నా పిల్లలకు తొందరగా ఇస్లాం స్వీకరించమని ఆ దేవునికి దుఆ చేస్తున్నాను. ఇస్లాం స్వీకరించిన ఈ రెండు సంవత్సరాల్లో నాకెంతో మనశ్శాంతి కలిగింది.

- ఎం. సాజిద
(సబాహాయ)

నవ ముస్లింల రచనలు రావాలి

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

నెలవంక పత్రిక నాకు చాలా బాగా నచ్చింది. నెలవంకను చదువుతుంటే మేను పులకరిస్తుంది. మరో పక్క ఆనందభాష్పాలు రాలుతున్నాయి. నెలవంక పుస్తకంలో ఒక్కొక్క అక్షరము నన్ను ఆకట్టుకుంటున్నాయి. ఎన్నో తెలియని విషయాలు దీని ద్వారా తెలుసుకుంటున్నాము. ఇంకా ఎన్నెన్నో తెలుసుకోవాలన్నది నా కోరిక. ఈ పుస్తకానికి ఫుల్‌స్టాప్ పెట్టకుండా ఉండాలన్నది నా వాంఛ. ఈ పుస్తకం ద్వారా ఇంకా ఎంతో మంది రుజుమార్గం పొందాలని మనసారా వేడుకుంటున్నాను. అలాగే ఈ నెలవంక లో నవముస్లింలు వ్రాసే వ్యాసాలు ఎక్కువగా రావాలని నా అభిప్రాయం. IPC వారికి నా ధన్యవాదాలు.

-ఈమాన్
(ఫహీల్)





ఇండియా దటీజ్ భారత్

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

జనవరి 26 వ తేదీ...

అంటే భారత **గణతంత్ర దివస్** (The Republic day of India). రాష్ట్రపతి భవన్ సాక్షిగా భారత గణతంత్ర వేడుకలు మరోసారి కొత్త ఢిల్లీలో కనువిందు చేయబోతున్నాయి. ఈసారి ప్రప్రథమంగా ఒక మహిళా రాష్ట్రపతి సైనిక వందనం స్వీకరించనున్నారు. ఎర్రకోట నుంచి ఒక మహిళా ప్రధాని త్రివర్ణ పతాకం ఎగురవేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి గాని రాష్ట్రపతి భవన్ ముంగిట ఒక మహిళా రాష్ట్రపతి సైనిక వందనం స్వీకరించటం మాత్రం ఇదే తొలిసారి. అదీ విశేషం!

ఈ సందర్భంగా ఒక సగటు పౌరుని మదిలో మెదిలే సందేహం ఒకటుంది– ఏడాదికి రెండు సార్లు భారత వేడుకలా? ఏటేటా స్వాతంత్ర్య వేడుకలు (ఆగస్టు 15) జరుగుతూనే ఉన్నాయి కదా! మధ్యలో ఈ **'గణతంత్రం'** ఏమిటి? అసలు స్వాతంత్ర్య దినోత్సవానికీ – గణతంత్ర దినోత్సవానికీ మధ్య గల తేడా ఏమిటి? అన్నది.

అదొక సంధి కాలం

ఈ ప్రశ్నలకు కాస్త వివరంగా జవాబు కావాలంటే 150 ఏళ్లు వెనక్కి పోవాల్సిందే. 1947 లో భారత దేశానికి తెల్ల దొరల నుండి విముక్తి లభించిన మాట నిజమే గాని లాంఛన ప్రాయంగా సంపూర్ణ స్వాతంత్ర్యం ఇంకా లభించలేదు. ఆ నాటికి స్వతంత్ర భారత దేశానికి కావలసిన రాజ్యాంగపరమైన ఒక వ్యవస్థ ఇంకా ఏర్పడలేదు. వేరే మాటల్లో చెప్పాలంటే 1947 ఆగస్టు 15వ తేదీ తెల్లవారేసరికి మన దేశానికి ఒక ప్రధానమంత్రి (పండిట్ జవహర్ లాల్ నెహ్రూ) ఉన్నారు. కాని స్వతంత్ర భారత దేశాధ్యక్షుడు మాత్రం లేడు. దేశానికి అధ్యక్షుడు (రాష్ట్రపతి) ఉండాలంటే ఒక రాజ్యాంగం ఉండాలి. రాజ్యాంగం ప్రకారం ఎన్నిక వ్యవస్థ ఉండాలి. అదేదీ ఇంకా లేదు గనక తెల్ల దొరలు పోతూ పోతూ ఆనాటి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్‌నే స్వతంత్ర భారత గవర్నర్ జనరల్ (1947–48) గా పెట్టిపోయారు. ఆనక భారత మేధావి చక్రవర్తి రాజగోపాలచారి (1948–50) ఆ పదవీ బాధ్యతలను స్వీకరించి భారత తొలి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్‌కి లాంఛన ప్రాయంగా అధికారం అందజేశారు.

భారత రాజ్యాంగ క్రమ వికాసం

ఆ మాటకొస్తే స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న కాలంలో భారత దేశంలో రాజ్యాంగ క్రమ వికాసానికి గట్టి పునాదులు వేసిన ఘనత మాత్రం తెల్లవారికే దక్కుతుంది. 1857 సిపాయిల తిరుగుబాటు వరకు ఆంగ్లేయులు ఈస్టిండియా కంపెనీ ఆధ్వర్యంలో ఇండియాను పరిపాలించేవారు. కేవలం కొద్దిమంది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, మరి కొద్దిమంది బోర్డ్ ఆఫ్ కంట్రోల్ సభ్యులు కలసి యావత్తు అఖండ భారత చక్రం తిప్పేవారన్నమాట! అయితే 1857లో సిపాయిల తిరుగుబాటు విఫలమైన తరువాత, భారత పరిపాలనా పగ్గాలన్నింటినీ విక్టోరియా మహారాణి తన చేతుల్లోకి తీసేసుకుని, ఇక నుంచి బ్రిటిష్ పార్లమెంటు చేసే చట్టాలే ఇండియాకు శిరోధార్యమని ప్రకటించింది.

(మిగతా 13 వ పేజీలో)



భారత రాష్ట్రపతులు

1. డా. రాజేంద్ర ప్రసాద్ (1950 - 1962)
2. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ (1962 - 1967)
3. డా. జాకిర్ హుస్సేన్ (1967 - 1969)
4. శ్రీ. వి.వి. గిరి (1969 - 1974)
5. శ్రీ. ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ (1974 - 1977)
6. శ్రీ. నీలం సంజీవ రెడ్డి (1977 - 1982)
7. జ్ఞానీ జైల్ సింగ్ (1982 - 1987)
8. శ్రీ ఆర్. వెంకటరామన్ (1987 - 1992)
9. డా. శంకర్ దయాళ్ శర్మ (1992 - 1997)
10. శ్రీ కె.ఆర్. నారాయణన్ (1997 - 2002)
11. శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలాం (2002 - 2007)
12. శ్రీమతి ప్రతిభా పాటిల్ (2007 -)

PAGE 2-3.pdf 1/9/08 8:22:21 PM



بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

ప్రియమైన తెలుగు పాఠకులకు,

ఇదీ మీ **నెలవంక!** మీలో ధార్మిక పరిజ్ఞానాన్ని పెంపొందింపజేయటానికి, మిమ్మల్ని అలరించటానికి నెలనెలా మీ ముందుకు వస్తున్న సచిత్ర మాసపత్రిక ! వివిధ అంశాలతో కూడిన వ్యాసాలతో మా సంపాదకవర్గం దీన్ని బాగా ముస్తాబు చేసి మరీ మీకు సమర్పిస్తోంది.

పాఠకుల్లో ధర్మావగాహనను పెంపొందించటంతోపాటు సాధ్యమైనంత ఎక్కువగా విషయ పరిజ్ఞానాన్ని అందజేయటం కూడా ఈ మ్యాగజైన్ ఆశయాలలో ఒక ఆశయమే. ఒక పరిశోధన ప్రకారం 70 శాతం పరిజ్ఞానం మనిషికి పఠనం ద్వారానే అబ్బుతుంది.

సత్యధర్మమైన ఇస్లాం ఈ పఠనం, అధ్యయనం పట్ల చాలా శ్రద్ధ వహించింది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై తొట్ట తొలిసారిగా అవతరించిన దైవవాణి **"ఇఖ్రు బిస్మి రబ్బికల్లజీ ఖలఖ్"** (సృష్టించిన నీ ప్రభువు పేరుతో చదువు) అన్నదే. అంటే తొలి వాక్యంలోనే చదువుకు గల ప్రాముఖ్యత ఎటువంటిదో నొక్కి చెప్పటం జరిగింది.

అందుకే-

మీరు మాట్లాడే భాషలో, మీకు ప్రియాతి ప్రియమైన తెలుగులో ఈ **'నెలవంక'** ను నెలనెలా మీకు అందించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాము. ఒక ఏడాది కాలంగా ఈ పత్రిక - నిరాఘాటంగా- మీకందుతోంది. మీ అభిరుచికి, అవసరాలకు తగ్గట్టుగా దీన్ని తీర్చిదిద్దాలని **నెలవంక** సంపాదక వర్గం ఆరాటపడుతోంది. విలువైన మీ అభిప్రాయాల, సూచనల కోసం సదా నిరీక్షిస్తూ ఉంటాము.

సదా మీరు అల్లాహ్ రక్షణలో ఉండాలని కాంక్షిస్తూ.....

ఖాలిద్ అస్సబా
మేనేజర్ , సందేశ విభాగం
ఇస్లాం ప్రెజెంటేషన్ కమిటీ



... హిజ్రత్

సజ్జనుల సహచర్యాన్ని పొందే యత్నంలో స్వస్థలాన్ని, ఇల్లూ వాకిలి (తూ.గో.జిల్లా, రాజోలు మండలం, దిండి క్ష శిక్షణ ఇచ్చి, వారిని మంచి ముస్లిములుగా తీర్చిదిద్దటానికి అలుపెరగని పోరాటం సాగించి కృతకృత్యులైన ముస్లింలు కేవలం సాక్ష్యవచనం (కలిమయె షహాదత్) పలికి తమను ముస్లింగా ప్రకటించుకుంటే సరిపోదని, కి వలసపోవటం (హిజ్రత్ చేయటం) కూడా అనివార్యమేనంటారీయన. అలనాడు దైవప్రవక్త ఇబ్రాహీం డిపారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) దైవాజ్ఞపై మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేశారు. ప్రవక్త ఎప్పటికీ ఉంటుంది అంటారు ఇక్బాల్ గారు. ఈయన మనోభావాలకు ప్రతిరూపమైన వ్యాసమే ఈ **హిజ్రత్**. న్నిము.) - **సంపాదకుడు**



వ్యవహారంలోను ఆచితూచి అడుగు వేయాలి. ఆత్మీయులు ఎత్తిపొడుపు మాటలతో మానసికంగా కుంగదీస్తారు. లోలోపల మన విశ్వాసాన్ని ఛిద్రం చేస్తారు. అటువంటి పరిస్థితి ఏర్పడక ముందే మన భార్యాబిడ్డలతో ఆ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస పోవాలి. లేదా అల్లాహ్ ప్రీతి కొరకు సురక్షిత మైన స్థానాన్ని ఎన్నుకోవాలి. ఈ వలస (హిజ్రత్) తప్పనిసరి.

పుట్టిన ఊరు, ప్రాంతం ఆస్తిపాస్తులు– ఇరుగు పొరుగు ప్రజలు, బంధుమిత్రులు అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్ళు అంటే ఎవరికి ప్రేమ ఉండదనీ!? అది మన జన్మస్థానానికి గుర్తు. చిన్ననాటి చిలిపి చేష్టలకు చెదరని చిహ్నాలు. మనం ఏ దేశమేగినా, ఎక్కడ నివసించినా గాని జన్మ స్థానం అనేది హృదయంలో మెదలుతూనే ఉంటుంది. మన పాసుపోర్టులో చూడండి ప్లేస్ ఆఫ్ బర్త్ (పుట్టిన స్థానం) వ్రాయాలి తప్పనిసరిగా.

మహాప్రవక్త ముహమ్మద్(స) గారికి మక్కా నగరం ఎంతో ప్రియమైనదే. కాని మదీనా వలస పోయారు. దేనికొరకు? కేవలం అల్లాహ్ కొరకు! ఆయన మోపిన బరువుబాధ్యతల కొరకు వలస పోవలసి వచ్చింది. ఆయనతో పాటు ఆయన శిష్య బృందం కూడా వలస పోవలసి వచ్చింది. నిజంగా వీరిని సత్యసంధులనే పేర్కొనవచ్చు.

జీవితంలోని ఏ రంగంలోనైనా సరే ఓర్పు సహనం కావాలి. అది లేకుండా ఏ విశ్వాసీ ఏ చిన్న కార్యం కూడ సాధించలేడు. స్థిమితమైన మనసుతో ఇస్లామ్‌ను సదా దృష్టిలో యుంచుకుంటూ సరయిన నిర్ణయం తీసుకోవాలి.

కలవరం, భయం నిరాశ అనుచితమైన ఆవేశం – వీటికి దూరంగా యుండాలి.

నిజమే. మనిషికి మంచి మాహోలు (మంచి వాతావరణం) యుండాలి. ఉంటేనే మంచిగా జీవించగలడు. మనిషికి ఇరుగుపొరుగు ఎల్లప్పుడు మంచిదై యుండాలి. మంచిని సంపాదించుకోవాలి. మంచి–చెడు ఎన్నటికీ ఒక్కటి కావు. చెడును తొలగించటానికి ఇస్లామ్ వచ్చింది. ఎంతటి చెడునైనా శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించవచ్చు.

మరో చోట దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా అనబడింది– "ఓ విశ్వాసులారా! మీరు రుకూ–సజ్దా చేసేవారితో కలసి ఉండండి." రుకూ, సజ్దా చేయువారెవరు? ముస్లింలే కదా! ఈ ముస్లింలు అల్లాహ్‌కు విధేయులై యుంటారు– మరియు ప్రవక్తకు విధేయులై యుంటారు. అటువంటి వారే ముహమ్మద్(స) గారిని సంపూర్ణంగా అనుసరిస్తారు. వారు అల్లాహ్ ఆజ్ఞలను శిరసావహిస్తారు. అటువంటి వారితో యుండండి అని తాకీదు చేయటం జరిగింది. కొత్తగా ఇస్లామ్ స్వీకరించిన ముస్లిమ్ సోదర సోదరీమణులారా! ఇస్లామ్ జీవనసరళి, జీవిత విధానం, సంస్కృతిలో లీనం కావలెనని ఉంటే జ్ఞానంగల పాతముస్లింలతో కలసి మెలసి పరస్పర సంఘ జీవిగా ఆ సమాజంలో ఒక ప్రత్యేకమైన చోటు సంపాదించుకోవాలి. బంధుత్వాన్ని ప్రేమను పెంపొందించుకోవాలి. సమాజ కార్యకలాపాలలో అన్ని విషయాలలో చేదోడు–వాదోడుగా యుండాలి. మన స్థోమతను బట్టి సమాజానికి సహకార మందించాలి. కలసి యుంటే కలదు సుఖం– వేరుగా యుంటే తీరదు లోటు. మన వ్యవహార శైలిని బట్టే ఎదుటి వారి నుంచి మనకు సహాయసహకారాలు లభిస్తాయి కదా!

సోదర సోదరీమణులారా! ఇస్లాం భాగ్యం లభించిన తరువాత కూడా పాత భాగ్యం కోసం అర్రులు చాపకండి. 'ఇస్లామ్' అనే భాగ్యం ఇహపర సాఫల్యాల భాగ్యం –

పశుపక్షాదులు, కీటకాలు కూడా అనువైన వాతావరణం కోసం వలస పోతూ వుంటాయి. మరి మనం వివేకం గలవారం. ఇస్లామ్ అనే సత్యధర్మాన్ని కాపాడుకునేందుకు వలస పోవాలా? వద్దా? అది మీ 'విశ్వాసం' (విశ్వాసం)తో ముడిపడివున్న విషయం. ■

PAGE 4-5.pdf 1/9/08 8:27:18 PM





ముహమ్మద్ ఇక్బాల్

(వ్యాస రచయిత సత్యప్రేమికులు. సత్యాన్వేషణలో సాఫల్యం పొందిన ధన్యజీవి. శుభాత్మలను వేదికే ఆరాటంలో, ... గ్రామం)ని విడిచి వేరొక చోటికి కుటుంబ సమేతంగా ప్రస్థానం చేసిన దైవభక్తిపరుడు. సంతానానికి మంచి ధార్మి... ఈ ఇక్బాల్ భాయిని చూసినప్పుడల్లా కించిత్ ఈర్ష్య కలుగుతూ ఉంటుంది. సన్మార్గ భాగ్యాన్ని ఆస్వాదించిన నవ... అవసరమైతే ఇస్లాం ధర్మావలంబనలో అవరోధంగా ఉన్న స్వస్థలాన్ని వదలి సానుకూలమైన మరో ప్రదేశాని... (అలైహిస్సలాం) **'అస్లంతు లిరబ్బిల్ ఆలమీన్'** అన్న తన మాటను నిలుపుకోవటానికి దేశదేశాలు సంచరిస్తూ గ... ప్రియసహచరులు సయితం ఇథియోపియా, మదీనాలకు వలసపోయారు. ఈ 'వలస' నాడే కాదు, నేడూ ఉంది. హిజ్రీ శకం నూతన సంవత్సరం సందర్భంగా నెలవంక పాఠకుల కొరకు ఆయన వ్యాసాన్ని కానుకగా సమర్పిస్తున...

ఇస్లామ్ స్వీకరణ అనేది అల్లాహ్ ఇచ్చిన బహుమానమే. అంటే ఖుదా కా వర్థాన్.

నవ ముస్లిం సోదర సోదరీమణులారా!

ఇస్లామ్‌ను విశ్వసించామని, మేము ముస్లిమయ్యామని ఎంతో ఆనందంగా చెప్పుకుంటాం. మంచిదే. ఒక ముస్లిమ్ అయినందుకు గర్వించవలసినదే. కాని ముస్లిమ్ స్త్రీ అయినా– పురుషుడైనా, మసీదుల్లోనైనా– మార్కెట్లోనైనా ఒక నిజమైన ముస్లిముగా మసలుకోవటానికి ప్రయత్నం చేయాలి. తప్పిపోయిన కుమారుడు తిరిగి దొరికితే తల్లిదండ్రులెంతో సంతోషిస్తారు. అంతెందుకు 10 గొర్రెలలో 1 గొర్రె తప్పిపోయి మరలా కనిపిస్తే ఆ గొర్రెల కాపరి ఎంతో ఆనందిస్తాడు. మార్గ భ్రష్టుడైన తన దాసుడు తిరిగి ఋజుమార్గం (ఇస్లాం) వైపు మరలినప్పుడు దేవుడు కూడా తల్లిదండ్రులకంటే ఎన్నో రెట్లు అధికంగా సంతోషిస్తాడు. అతని అజ్ఞానాన్ని క్షమించి జ్ఞానాన్ని వొసంగుతాడు. కాబట్టి ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించాం అంటే సరిపోదు. దాన్ని ఎల్ల వేళలా దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించాలి. ఎందుకంటే పుట్టి పెరిగిన మతభావాలు, పరిసరాల ప్రభావం భావావేశాలు, అనుబంధాల వల్ల మనిషి అంత తేలికగా తన సంస్కృతిని, మత ధర్మాన్ని వదులుకోలేడు. ఒకవేళ ధైర్యసాహసాలతో సిద్ధపడినా సైతాను ప్రేరేపణ మాత్రం నలు దిక్కుల నుండీ ప్రేరేపిస్తుంది. పూర్వ పరిధిని దాటి బయటకు –ఇస్లాం పరిధిలో– నడవాలి అంటే మనిషిలో తీవ్రమైన సంఘర్షణ జరగాలి తప్పనిసరిగా.

దానికి తఖ్వా కావాలి

తఖ్వా అంటే ఏమిటి? భయపడటం, జాగ్రత్తపడటం అని అర్థాలు వస్తాయి. ఎవరికి భయపడాలి? ఏ విషయానికి భయపడాలి? ఏ ఏ వాటికి దూరంగా యుండాలి? అనేది ప్రశ్న. ముస్లిం అనే వాడు అందరికంటే అధికంగా దైవా (అల్లాహ్)న్నే ప్రేమిస్తాడు. ఆరాధ్యుడైన అల్లాహ్ ఆగ్రహానికి దూరాన యుండాలి. ఎవరైతే దైవభీతిని అనుసరించాడో అతనిలో సంశయాలు, సందేహాలు అన్నీ దూరమై పోతాయి. అతడు ఎక్కడ వీలైతే అక్కడ ప్రశాంతముగా యుండవచ్చు. అతనికి కావలసింది అతనికి లభించింది. ఇప్పుడాతడు భయాందోళన నుండి సురక్షితంగా యుండాలి. **'తఖ్వా ఇక్కడ ఉంటుంది'** అంటూ మహాప్రవక్త(స) మూడుసార్లు తన హృదయం వైపు సంజ్ఞ చేశారు. దాని స్థితి ఎరిగినవాడు కేవలం అల్లాహ్‌యే. ఆయన తప్ప మరెవరూ తెలుసుకోలేరు. దానిని ఏ కొలమానంతోను కొలవలేము.

హెచ్చరిక

విశ్వసించిన ప్రజలారా! ఇస్లామ్‌లో పూర్తిగా ప్రవేశించండి. షైతాను అడుగుజాడల్లో నడవకండి. అతడు మీకు, ఆగర్భ శత్రువు అంటూ హెచ్చరిస్తుంది దివ్యఖుర్‌ఆన్.

సంపూర్ణ హృదయంతోను, సంపూర్ణ బలంతోను సంపూర్ణ వివేకంతో నమ్మి విశ్వసించి దేవుని ఆజ్ఞలకు లోబడి ఆచరణాత్మకంగా జీవిస్తూ క్రియా రూపంలో బహిర్గతం చేయాలి.

చంపినా చంపబడినా గాని ధర్మము నుండి తిరిగిపోకూడదు. ఇస్లామ్ స్వీకరించక పూర్వం మనలో ఏ ఏ అజ్ఞాన పోకడలు అహంకార భావాలు ఉండేవో వాటన్నింటికీ స్వస్థీ చెప్పాలి. అహంకారం చాలా ప్రమాద కరమైనది. మద్యం హరామ్. కాని అహంకారం మద్యం కంటే ఇంకా దారుణం. ఇస్లాం వేటినైతే తిరస్కరించిందో, వాటన్నిటినీ విడనాడాలి, వేటినైతే స్వీకార యోగ్యంగా ప్రకటించిందో వాటన్నిటిని క్రియా రూపంలో తీసుకురావాలి. హరామ్–హలాల్ (ధర్మాధర్మాల) విషయంలో విచక్షణ పాటించాలి. త్రాగుడు, దొంగతనం వ్యభిచారం అబద్ధం మరియు అమానత్ పట్ల బహు జాగ్రత్తగా యుండాలి. ఇవి కష్టమైనవే కాని తఖ్వా గల ముస్లింకు చాలా సులభం.

ఇస్లాం స్వీకరించిన సోదర సోదరీమణులారా! అతి ముఖ్యమైన విషయం మరొకటి యుంది. అదే హిజ్రత్ చేయటం. హిజ్రత్ అంటే వలస పోవటం అని అర్థం. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస పోవటాన్ని హిజ్రత్ అంటారు. అయితే ఇస్లాం పరిభాషలో హిజ్రత్ అంటే, మనిషి తాను నమ్మిన సిద్ధాంతాలను, విధానాలను అవలంబించటానికి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేనప్పుడు తన ధర్మావలంబనకు అనుకూలంగా ఉండే ప్రదేశానికి తరలి వెళ్ళటం, చెడు సహవాసం నుండి మంచి వారి సహవాసం కొరకు వలసపోవటం, దురాచారాలు, మూఢనమ్మకాల వాతావరణం నుండి సదాచరణల వాతావరణం వైపునకు ప్రయాణించటం, చెడు వ్యవస్థ నుండి సత్యప్రధానమైన వ్యవస్థ వైపునకు సాగిపోవటం– ఇదే హిజ్రత్ (ప్రస్థానం)!

దివ్యఖుర్‌ఆన్ ఇలా బోధిస్తుంది–

"ఓ విశ్వాసులారా! మీరు మీ స్వయాన్నీ మీ భార్యాబిడ్డలను నరకాగ్ని నుండి రక్షించుకోండి". మనం ఇస్లామ్ స్వీకరించాము. ఇక ఇస్లాంకు కట్టుబడాలి. దాని కోసం అవసరమైతే హిజ్రత్ చేయాలి. దుష్టుడికి దూరంగా యుండమన్నారు పెద్దలు. ఆ దుష్టుడికి, వాడి దుష్టత్వానికి నాయకుడు ఎవరు? షైతాన్! వాడి బారి నుండి మనల్ని మనం కాపాడుకోవాలి. ఆ ధూర్తుడి ఏ ఆకారంలోనైనా వచ్చి ప్రేరేపించగలడు. హృదయాలలో కలతలు రేపగలడు. ఎగతాళి చేయించగలడు. వక్రమార్గాలు చూపించగలడు. అనుమానాలు రేకెత్తించగలడు. అందుకే మన విశ్వాసాన్ని కాపాడుకోవాలి. అడుగడుగునా ప్రతి చిన్న విషయంలోను, ప్రతి

మానవులలో ఎక్కువ శాతం మంది ఒక్కడైన నిజదేవుని వదిలేసి రకరకాల అనేక దేవుళ్ళను కొలుస్తున్నారు. విద్యావిజ్ఞానాలు లేని ఆ రోజుల్లో మానవులు ఆపదల బారి నుండి, వ్యాధుల బారి నుండి రక్షణ పొందేందుకు వేరు, వేరు దేవుళ్ళను చేసుకున్నారు. కాని శోచనీయమైన విషయమేమిటంటే, విద్యా విజ్ఞానాలు సర్వ సామాన్యమైన ఈ రోజులలో కూడా దేవుని నిదర్శనాలను పరికించి, పరిశోధించి, ఆలోచించే శక్తిని కలిగి ఉండి కూడా మానవులు నిజ దేవుని వదలి దేవుని సృష్టితాలను కొలుస్తున్నారు.



ఒకరి కంటే ఎక్కువ దేవుళ్ళుంటే?

ఒకవేళ అనేక దేవుళ్ళే ఉండి ఉంటే ఈ సృష్టి ఛిన్నాభిన్నమయ్యేది. ఎందుకంటే వీరి అభిప్రాయాలు భిన్నంగా ఉండేవి. ఒకరికి నచ్చినది వేరొకరికి నచ్చేది కాదు. మీరెప్పుడైనా ఈ ఆకాశం, భూమి సూర్యచంద్రులు, గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రాలు గురించి ఆలోచించలేదా? వాటికి విధించబడిన హద్దుల్లో ఇవి పరిభ్రమణం చెందుతున్నాయి. ఒక క్రమ పద్ధతిలో నడుస్తున్నాయి. **"వారు తమ పైనున్న ఆకాశాన్ని పరికించి చూడలేదా? ఏవిధంగా మేము దాన్ని నిర్మించి తీర్చి దిద్దాము? అందులో ఎక్కడా ఎలాంటి రంధ్రం గాని, నెర్రగాని లేదు".** (ఖాఫ్ : 6)

"చంద్రుని కోసం మేము మజిలీలు (చంద్రకళలు) నిర్ణయించాము. అది వాటిని దాటుకుంటూ చివరికి వాడిపోయిన పాత ఖర్జూరపు మండలా మారిపోతుంది. చంద్రుని పట్టుకునే శక్తి సూర్యునిలో లేదు. అలాగే రాత్రి పగటిని దాటిపోలేదు. సమస్తం ఒక్కొక్క కక్ష్యల్లో (అంటే తమ, తమ నిర్ణీత కక్ష్యల్లో) సంచరిస్తున్నాయి".
(యాసీన్ : 39, 40)

ఒకవేల ఒకే దేవుడు కాకుండా అనేక మంది దేవుళ్ళు ఉండి ఉంటే ఇంతవరకు ఏ ఒక్కటి మిగిలేదు కాదు. **"భూమ్యాకాశాల్లో ఒక్క దేవుడే కాకుండా ఇతర దైవాలు కూడా ఉండి ఉంటే భూమ్యాకాశాల వ్యవస్థ (ఎప్పుడో) విచ్ఛిన్నమైపోయి ఉండేది. వారు కల్పిస్తున్న వాటికి విశ్వసామ్రాజ్య సింహాసనాధీశుడైన దేవుడు ఎంతో అతీతుడు, పరమ పావనుడు.** (అంబియా: 22)

దేవుడు మరియు ఖుర్‌ఆన్

దివ్యఖుర్‌ఆన్ దేవుని నిదర్శనం. మానవుల రుజుమార్గం కొరకు దేవుని తరఫు నుంచి అవతరించిన గ్రంథాలలో చిట్టచివరి గ్రంథం. ఇక ప్రళయం వరకు ఏ గ్రంథం అవతరించదు. ఈ గ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను మంచీ చెడులను వేరుపరచే స్పష్టమైన బోధనలున్నాయి.
(బఖర: 185)

ఈ గ్రంథం దేవుని అస్థిత్వం దేవుని ఏకత్వం ఇహం, పరం, ముహమ్మద్(సల్లం) దౌత్యం, మరణాంతరజీవితం, ప్రళయం, స్వర్గం, నరకం, జీవిత పరమార్థం, దైవదూతలు, దైవప్రవక్తలు, దివ్యగ్రంథాలు, కర్మలు (ఆచరణలు), విధి నిర్ణయం, పాప పుణ్యాలు, కష్ట సుఖాలు, మిథ్యాదైవాలు, రాజకీయ విధానం, ఆర్థిక విధానం, నీతి శాస్త్రం (నైతిక విధానం) సామాజిక జీవితం, విజ్ఞానశాస్త్రం (సైన్సు), ఆరాధనలు దానధర్మాలు మొదలగు వాటన్నిటిపై చర్చిస్తుంది. మానవునికి సరియైన మార్గం చూపుతుంది.

ప్రపంచంలోని ఇతర మతగ్రంథాలు ఎన్ని మార్పులకు చేర్పులకు గురైనప్పటికిన్నీ, దేవుడున్నాడని, దేవుడొక్కడేనని ఇప్పటికీ ఘోషిస్తున్నాయి. కాని వాటిని చదివి పరిశోధించి, ఆలోచించి విశ్వసించేవారే కరువయ్యారు. పూర్వ గ్రంథాలు ఏ దేవుని పరిచయం చేశాయో దివ్యఖుర్‌ఆన్ కూడా ఆ దేవుడ్నే పరిచయం చేసింది. ఆయనే అల్లాహ్. ఇది ముస్లిములు ఉపయోగించే పదమని ఆయన ముస్లిముల దేవుడని అపోహకు లోనుగాకండి.

ఈ ప్రపంచంలో దేవునికి అల్లాహ్ తప్ప వాడే వేరే ఇతర పదాలు బహుదైవాలుగా మారే ప్రమాదముంది. ఉదా:- దేవుడు-దేవుళ్ళు. దేవతలుగా **గాడ్ - గాడ్స్**గా మారవచ్చు కాని అల్లాహ్ అనే పదంలో బహువచనం చోటు చేసుకోదు. **"అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు, ఆయన సకల లోకాలకు ప్రభువు".** (ఫాతిహా: 1)

ఈ విధంగా అల్లాహ్ గురించి, ఆయన ఔన్నత్యం గురించి, ఆయన కీర్తనల గురించి, ఆయన అనుగ్రహాల గురించి రాసుకుంటూపోతే ఈ వ్యాసాలు సరిపోవు. ఈ పరిమితమైన జ్ఞానం సరిపోదు. మీకు అల్లాహ్ చిరునామా కావాలంటే ఆయన ఎప్పటి నుంచి ఉండాడు? ఆయన ఎక్కడున్నాడు ? ఆయన ఈ ప్రకృతిని ఎందుకు సృష్టించాడు? ఆయన మానవులను ఇతర జీవులను ఎందుకు సృష్టించాడు? ఇలాంటి ఎన్నో సందేహాలకు సమాధానాలు కావాలంటే దివ్యగ్రంథమైన ఖుర్‌ఆన్‌ను ఆశ్రయించండి. నిష్కల్మషమైన మనసుతో దాన్ని చదవండి. ఈ సృష్టిని పరికించి చూడండి. ఆలోచించండి. మీ సందేహాలన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి. మీ మనసు దీని పట్ల తృప్తి చెందితే మరి ఆలస్యం చేయకండి. అల్లాహ్‌ను విశ్వసించండి. ఒకవేళ మీరు సత్యాన్ని గ్రహించి కూడా విశ్వసించకుండా ఉంటే బలవంతమేమీ లేదు. ఎందుకంటే **"ఇస్లాం ధర్మ స్వీకరణలో ఎలాంటి బలవంతం బలాత్కారాలు లేవు".** (బఖర : 256)

అల్లాహ్ తన ఈ విశ్వసామ్రాజ్యంలో భూమ్యాకాశాలను, వాటి మధ్యన ఉండే ప్రతి వస్తువును మానవుల కోసం సృష్టించాడు. మానవులకు సుఖాలు సౌలభ్యాలు పొందడానికి కావలసిన జ్ఞానం తెలివి తేటలను అనుగ్రహించాడు. మరి అలాంటి కరుణామయుడైన అల్లాహ్‌కు కృతజ్ఞులయి ఉండటం మానవుల విద్యుక్త ధర్మం కాదా?

అల్లాహ్ తన అపారమైన అనుగ్రహాలనిచ్చి మానవులను ఇలా ప్రశ్నిస్తున్నాడు: **జిన్నాతులారా! మానవులారా! మీరు మీ ప్రభువు యొక్క ఏఏ అనుగ్రహాలను తిరస్కరించగలరు?** (రహ్మాన్ :13)

PAGE 6-7.pdf 1/9/08 8:28:26 PM

ఆ దేవుడు



దేవుని గురించి ప్రతి మానవుని మస్తిష్కంలో అసలు దేవుడున్నాడా? ఉంటే ఎలా ఉంటాడు? ఎక్కడున్నాడు? ఉంటే ఎందుకు కనిపించటం లేదు? దేవుడొక్కడే ఇంత పెద్ద విశ్వ సామ్రాజ్యాన్ని ఎలా నడపగలడు? అనే రకరకాల సందేహాలు వస్తూ వుంటాయి. ఇంకా దేవుణ్ణి చూడకుండా ఎలా విశ్వసించేది? దేవుడు మా ముందుకు రావాలి. రోజూ కాకపోయినా వారానికో, నెలకో ఒక తూరి కనపడాలి. అసలు దేవుడొక్కడా, లేక అనేక దేవుళ్ళా? ఇలాంటి ఎన్నో సందేహాలకు సరియైన, సహేతుకమైన సత్యంతో కూడుకున్న సమాధానాలు, ఒక్క ఇస్లాంలో తప్ప మరే మతంలోనూ, దివ్యఖుర్‌ఆన్‌లో తప్ప మరే గ్రంథంలోనూ బహుశా దొరకవు.

ఎవరైతే సత్యాన్ని ప్రేమిస్తారో, ఎవరిలోనైతే సత్యం గ్రహించాలనే జిజ్ఞాస ఉందో, ఎవరైతే రుజు మార్గంలో ఉండాలనుకొంటారో, ఎవరైతే ఇహ-పరలోకాలలో సాఫల్యం పొందాలను కుంటారో, వారు తప్పకుండా ఇస్లాంను అధ్యయనం చేయాలి. దేవుడు ఏనాడైతే ఆది దంపతులైన ఆదం, హవ్వాలను పంపాడో ఆనాడే ఆయన ఇలా ప్రకటించాడు: **"మీరంతా ఇక్కడ నుంచి దిగిపోండి, ఇకపై నా తరఫు నుండి ఏదైనా ఉపదేశం (మార్గదర్శకత్వం) మీవద్దకు వచ్చినప్పుడు, నా ఈ ఉపదేశాన్ని అనుసరించేవారికి ఏ విధమైన భయంకాని, దుఃఖం కాని ఉండదు."** (అల్ బఖర: 38)

ఆదం, హవ్వాలు ఒకే ఒక దేవుడైన అల్లాహ్‌నే విశ్వసించారు. ఆయన్నే ఆరాధించారు. మొదట్లో మానవులందరు ఏకేశ్వరోపాసకులే. రాను రాను మానవులు పెరుగుతూ వచ్చినట్లే దేవుళ్ళను కూడా పెంచుకుంటూ వచ్చారు. **"ప్రారంభంలో మానవులంతా ఒకే సముదాయంగా ఉండేవారు. తరువాత వారు విభిన్న విశ్వాసాలు, ఆచారాలు కల్పించుకుని చీలిపోయారు. నీ ప్రభువు వైపున ముందే ఒక మాట నిర్ణయించబడి ఉండకపోతే, వారు పరస్పరం విభేదించుకుంటున్న విషయాలు ఎప్పుడో పరిష్కరించబడి ఉండేవి".** (యూనుస్ :19)

"మీ సమాజం (ధర్మం) నిజానికి ఒకే సమాజం, నేను మీ ప్రభువును, కనుక మీరు నన్నే ఆరాధించండి, కాని ఆ ప్రజలు పరస్పరం విభేదించుకుని తమ ధర్మాన్ని చీలికలు పేలికలుగా చేసుకున్నారు. అయితే చివరికి అందరూ మా దగ్గరికి రావలసి ఉంది." (అంబియా: 92,93)

దేవుడున్నాడు

దేవుడున్నాడని ఈ అనంత విశ్వంలోని ప్రతి అణువూ సాక్ష్యమిస్తుంది. ఈ ప్రకృతిలోని ప్రతి వస్తువు అల్లాహ్ అస్తిత్వానికి నిదర్శనం. ఆలోచించేవారికి ఈ భూమ్యాకాశాల నిర్మాణంలోను, సూర్య చంద్రుల క్రమ బద్ధీకరణలోను, మానవ పుట్టుక, జంతుజాలం- ఇలా ఎన్నో నిదర్శనాలున్నాయి. **"దేవుడు భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఒక నిర్ణీతకాలం కొరకు సత్యబద్ధంగా సృష్టించాడు కాని చాలా మంది తమ ప్రభువును కలుసుకోవలసి ఉందన్న సత్యాన్ని నిరాకరిస్తున్నారు"** (రూమ్ :8)

భూమ్యాకాశాల్లోని ఏ వస్తువూ దేవునికి కానరాకుండా మరుగుగా లేదు. ఆయనే స్త్రీల గర్భాలలో మీ రూపురేఖల్ని తాను తలచిన విధంగా రూపొందించేవాడు. అపార భక్తి సంపన్నుడు, అద్భుత వివేచనాపరుడయిన ఆ స్వామి తప్ప (మీకు) మరో ఆరాధ్యుడు లేడు. (ఆలి ఇమ్రాన్:5,6)

ఈ సృష్టిలోని ప్రతి అణువు ఒకే దేవుడ్ని ఆరాధిస్తోంది. "భూమ్యాకాశాల్లోని యావత్తు సృష్టిరాసులు ఆయన పవిత్రతను కొనియాడు తున్నాయి. ఆయన ఔన్నత్యంతో పాటు ఆయన పవిత్రతను ప్రశంసించని సృష్టి అంటూ ఏదీ లేదు. కాని అవి చేసే దైవస్మరణను మీరు గ్రహించలేరు. నిస్సందేహంగా ఆయన ఎంతో ఉదారుడు, గొప్ప క్షమాశీలి. (బనీ ఇస్రాయీల్: 44)

దేవుని విశ్వసించడం

ఎవరైతే ఆలోచించకుండా దేవుని విశ్వసిస్తారో వారి విశ్వాసం బలహీనంగా ఉంటుంది. అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో తన దాసులను ఎన్నోసార్లు తను సృష్టించిన ఈ సృష్టిలోని అనేకానేక నిదర్శనాలను 'చూడండి, ఆలోచించండి' అని పిలుపు ఇస్తున్నాడు:- **"మానవులారా! మీ ఆరాధ్య దైవం ఒక్కడే. కరుణామయుడు, కృపాసాగరుడయిన ఆ దేవుడు తప్ప (మీకు) మరో దేవుడు లేడు. భూమ్యాకాశాల సృజనలో, రేయింబవళ్ళ చక్రభ్రమణంలో, సముద్రాలలో పయనిస్తూ మానవులకు ప్రయోజనం చేకూర్చే ఓడలలో, దేవుడు పై నుంచి కురిపించే వర్షపు నీటిలో, తద్వారా ఆయన మృతభూమికి జీవం పోసే (చెట్లూ చామల్ని పచ్చదనం చేసే) పనిలో, పుడమిపై పలువిధాల జీవరాసుల్ని విస్తరింప జేసే ఆయన సృష్టి నైపుణ్యంలో, గాలుల సంచారంలో, నేలకు-నింగికి మధ్య నియమ బద్ధంగా సంచరించే మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని అస్తిత్వాన్ని, ఆయన ఏకత్వాన్ని తెలిపే) అనేకానేక నిదర్శనాలున్నాయి.** (బఖర : 163,164)

ఎవరైతే దేవుడు సృష్టించిన ఈ విశ్వంలోని అణువణువును పరికించి, పరిశోధించి, తర్కించి, ఆలోచించి దేవుని విశ్వసిస్తారో వారి విశ్వాసం బలంగా ఉంటుంది. వారు దేవుని ఆజ్ఞలను తూ.చ తప్పకుండా శిరసావహిస్తారు.

దేవుడు - ఈనాటి మనిషి

మానవుల్లోని కొందరు జ్ఞానముండీ అజ్ఞానుల్లా దేవుని ధిక్కరిస్తున్నారు. దేవుని దాసులను దేవుని నుంచి దూరం చేస్తున్నారు. దేవుని విశ్వసించని వారు దేవుని అస్థిత్వానికి ఏమీ నష్టపరచలేరు. ఆయన సామ్రాజ్యంలో ఏ లోటూ రాదు. వారు తమకు తామే నష్టపరచుకుంటారు. బాగా గుర్తుంచుకోండి! ఎవరైతే దేవుణ్ణి ధిక్కరిస్తారో వారు ఎవరికీ మిత్రులు కాలేరు. తమకు తాము కూడా మిత్రులు కాలేరు. అసలు వారు తమ అస్థిత్వాన్నే ధిక్కరిస్తున్నారు. దేవుడే లేకుంటే ఏమీ లేదు. "మీరు అల్లాహ్ పట్ల తిరస్కారవైఖరి ఎలా అవలంబిస్తారు? వాస్తవానికి ప్రాణం లేని మీకు ఆయన ప్రాణం పోసాడు. మళ్ళీ మీ ప్రాణాన్ని తీసేదీ ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేదీ ఆయనే. చివరకు మీరంతా ఆయన వద్దకు మరలిపోతారు.
(అల్ బఖర : 28)



విశ్వాసుల మాత

హజ్రత్ జువైరియా బిన్తే హారిస్ (ర.అన్హా)



– అబూ తఫ్హీమ్
ipctelugu@rediffmail.com

విశ్వాసుల మాత **హజ్రత్ జువైరియా** (ర.అన్హా) "ఖుజాఅ" తెగకు చెందిన బనీ ముస్తలఖ్ వంశస్థురాలు. తండ్రి హారిస్ ఇబ్నె జర్రార్ బనూ ముస్తలఖ్‌కు నాయకుడు. భర్త పేరు ఇబ్ను సఫ్వాన్.

తండ్రి హారిస్, భర్త సఫ్వాన్ ఇద్దరూ ఇస్లాంకు బద్ధ విరోధులు. ఖురైష్ వారు రెచ్చగొట్టడంతో మదీనాపై దండయాత్ర సన్నాహాలు మొదలెట్టారు. ప్రవక్త మహనీయుల(స) కు ఈ వార్త అందిన వెంటనే బురైదా అస్లమీని అక్కడకు పంపించారు. బురైదా అస్లమీ వెళ్ళి, అక్కడి పరిస్థితులన్నింటినీ తనిఖీ చేసి, ఆ సమాచారం నిజమేనని ధృవీకరించారు. ప్రవక్త(స) సహాబాలను యుద్ధం కోసం సిద్ధం కావలసిందిగా ఆజ్ఞాపించారు.

హిజ్రీ 5వ సంవత్సరం షాబాన్ 2వ తేదీన ముస్లిం సేనలు మదీనా నుండి బయలుదేరి "మురైసీ"లో విడిది చేశాయి. ఈ వార్త విన్న హారిస్ సైన్యం అంతా ఛిన్నాభిన్నమైపోయింది. చివరికి హారిస్ కూడా అక్కడి నుండి పారిపోయాడు. కాని "మురైసీ" వాసులు మాత్రం చివరి వరకు పోరాడటానికి ప్రయత్నించినా ముస్లిం సేనల ముందు ఎక్కువ సేపు నిలబడలేకపోయారు. ఈ యుద్ధంలో 11 మంది మరణించారు. 6 వేల మంది యుద్ధఖైదీలుగా పట్టు బడ్డారు.

యుద్ధ ఖైదీల్లో **హజ్రత్ జువైరియా** (ర.అన్హా) కూడా వున్నారు.జువైరియా తండ్రి హారిస్ దైవప్రవక్త ముహమ్మద్(స) సమక్షంలో వచ్చి ఆమెను విడుదల చేయవలసిందిగా అభ్యర్థించాడు. ఆమె ఓ నాయకుడి కుమార్తె అనీ, అరబ్బుల్లో ఓ ప్రముఖుడి కుమార్తెను ఖైదీగా వుంచటం అవమానకరమని విన్నవించుకోగా, ఈ నిర్ణయాన్ని జువైరియాకే వదలిపెట్టారు కారుణ్య మూర్తి(స). హారిస్ ఆనందంతో తమ కుమార్తె వద్దకు వెళ్ళి ఈ విషయాన్ని తెలియజేసి నీ నిర్ణయం చెప్పమని కోరారు. అందుకు ఆమె "నేను మహాప్రవక్త(స) సేవలోనే ఉండిపోతాను" అని సమాధానం ఇచ్చారు.

ఓ నాయకుడి కుమార్తెకు తగిన భర్త ప్రవక్త ముహమ్మద్(స) కాగలరని సహాబాలందరూ సలహా ఇవ్వడంతో హజ్రత్ జువైరియా (ర.అన్హా) ను ప్రవక్త (స) వివాహం చేసుకున్నారు. అంతే కాదు, యుద్ధ ఖైదీలందరినీ విడుదల చేశారు. ఎందుకంటే, దైవప్రవక్త(స) ఏ తెగలో వివాహమాడినా, ఆ తెగవారు యుద్ధ ఖైదీలుగా ఉండలేరు.

ఆయిషా(ర.అన్హా) ఇలా అన్నారు: **"తమ తెగవారిపట్ల జువైరియా కన్నా ఎక్కువ శుభప్రదమైన వారిని నేను ఎవరినీ చూడలేదు, ఆమె మూలంగా వందలాది కుటుంబాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయి."**

అసదుల్ ఘాబ కథనం ప్రకారం, హారిస్‌కు తమ కుమార్తె వివాహం ప్రవక్త(స) గారితో జరిగిన విషయం తెలియదు. ఆయన తమ కుమార్తెను విడుదల చేయించటానికి ధనాన్నంతా ఒంటెలపై మోసుకుని బయలుదేరారు. అఖీఖ్ అనే ప్రాంతంలో ఒంటెలను మేతమేయటానికి వదలేసారు కాని తమకు ఎంతో ఇష్టమైన రెండు ఒంటెలను మాత్రం ఒక పర్వతకనుమలో దాచిపెట్టారు. మదీనా చేరుకుని ప్రవక్త(స) సమక్షంలో హాజరై, "ఈ ధనమంతా పుచ్చుకుని నా కుమార్తెను విడుదల చేయండి" అన్నాడు. **"ఆ రెండు ఒంటెలు ఏవి? అవే, అఖీఖ్‌లో నువ్వు దాచిపెట్టిన ఒంటెలు...!"** అని అడిగారు.



హారిస్ ఆశ్చర్యపోయి, ప్రవక్త మహనీయ ముహమ్మద్(స)తో ప్రభావితమయ్యి ఇస్లాం స్వీకరించాడు. తన కుమార్తె ప్రవక్త(స) గారి సతీమణి అని తెలుసుకుని అతని ఆనందం రెట్టింపయ్యింది. తన కుమార్తెకు ఇంత గొప్ప హోదా లభించడం చూసి ఎంతో సంతోషంగా తిరిగి వెళ్ళిపోయాడు.

హజ్రత్ జువైరియా (ర.అన్హా) సౌందర్యవతి, సుగుణవతి. ఆమె సౌందర్యం గురించి హజ్రత్ ఆయిషా(ర.అన్హా) చెబుతూ, **"జువైరియాలో సౌకుమార్యం, లావణ్యం కలగలసి ఉండేవి"** అన్నారు.

హజ్రత్ జువైరియా (ర.అన్హా) నిష్ఠా గరిష్ఠమైన జీవితం గడిపేవారు. ఓ రోజు ప్రభాత సమయంలో ఆమె దుఆ చేస్తుండటం ప్రవక్త మహనీయులు(స) గమనించారు. మధ్యాహ్నం తిరిగి వస్తే ఆమె అలాగే దుఆలో లీనమై వున్నారు. తరచూ ఉపవాసాలు వుండేవారు.

హజ్రత్ జువైరియా (ర.అన్హా) పై ప్రవక్త(స) కు అమితమైన ప్రేమ. దానితోపాటు చాలా గౌరవమర్యాదలు ఇచ్చేవారు.

హజ్రత్ జువైరియా (ర.అన్హా) 65 సంవత్సరాలు జీవించారు. హిజ్రీ 56వ ఏట హజ్రత్ అమీర్ ముఆవియ్యా ఖిలాఫత్‌లో మరణించారు. అప్పట్లో మదీనా గవర్నర్‌గా ఉన్న మర్వాన్ బిన్ హకమ్ ఆమె జనాజా నమాజు చేయించారు. జన్నతుల్ బఖీలో ఆమె ఖననం చేయబడ్డారు. హజ్రత్ జువైరియా (ర.అన్హా) విజ్ఞత, వివేచన గల మహిళామూర్తి. ప్రవక్త(స) వారి కొన్ని హదీసులు కూడా ఉల్లేఖించియున్నారు.

PAGE 8-9.pdf 1/9/08 8:29:46 PM

ఇస్రా - మేరాజ్



ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

(అంతరిక్ష అద్భుత విహారం)

జయానికి – ప్రతీకారానికి మధ్య సంఘర్షణగా ప్రవక్త (స) గారి ధర్మప్రచారం కొనసాగుతూ ఉండగా "ఇస్రా – మేరాజ్" అద్భుత సంఘటన ఒకటి జరిగింది. ప్రవక్త (స) గారి ఈ గగన యాత్ర. మస్జిదె హరామ్ నుండి దైవ దూత జిబ్రయీల్ (అలైహిస్సలామ్) తో 'బురాఖ్' అనే వాహనంపై బయలుదేరి మస్జిదె – అఖ్సా చేరుకున్నారు. అక్కడ దైవ ప్రవక్తలందరికీ నాయకత్వం వహించి నమాజు చేశారు. అక్కడ బురాఖ్‌ని మస్జిద్ ద్వారానికి కట్టివేశారు. అదే రాత్రి బైతుల్ మఖ్దిస్ నుండి ప్రవక్త (స) గారిని వెంటబెట్టుకుని ఆకాశాలలోకి సాగిపోయారు హజ్రత్ జిబ్రయీల్ (అలైహి). మొదటి ఆకాశంలో ఆదమ్ (అలైహి) ఎదుర య్యారు. ప్రవక్త (స) గారు ఆయనకు సలామ్ చేశారు. ఆయన ప్రతిసలామ్ చేస్తూ 'స్వాగతం! సుస్వాగతం!! అని అమిత వాత్సల్యంతో ఆహ్వానించారు. ఆయన ముహమ్మద్ (స) ప్రవక్త అని సాక్ష్యమిచ్చారు.

ఆ తర్వాత రెండో ఆకాశానికి చేరుకున్నారు. లోనికి ప్రవేశించాక అక్కడ జకరియ్యా కుమారుడు హజ్రత్ యహ్యా (యోహాను), మర్యం కుమారుడు హజ్రత్ ఈసా (అలైహిముస్సలామ్) తారసపడ్డారు. ప్రవక్త (స) గారు వారికి సలామ్ చేయగా, వారిద్దరూ బదులిస్తూ స్వాగతం పలికారు. ముహమ్మద్ (స) సత్ ప్రవక్త అన్న విషయాన్ని విశ్వసించారు. ఇలానే మూడో ఆకాశానికి చేరుకున్నారు. అక్కడ హజ్రత్ యూసుఫ్ (అలైహి)ను కలిసారు. (మునుపటిలాగే సలాం ప్రతి సలాం జరిగింది) నాల్గవ ఆకాశాన హజ్రత్ ఇద్రీస్ (అలైహి) తోను, ఐదవ ఆకాశంలో హజ్రత్ హారూన్ తోను, ఆరవ ఆకాశంలో హజ్రత్ మూసాతోను, ఏడవ ఆకాశంలో హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిముస్సలాం) ను కలిశారు. వారందరూ కూడా సలాంకు బదులిస్తూ, స్వాగతం సత్ప్రవక్తా ! అని ఆహ్వానించారు.

ఆ తర్వాత "సిద్రతుల్ ముంతహా" వరకు ఎక్కివెళ్ళారు. అక్కడ్నుంచి 'బైతుల్ మామూర్' చేరుకొన్నారు. అక్కడి నుండి అల్లాహ్ వైపునకు ఎక్కివెళ్ళారు. అల్లాహ్‌కు చాలా దగ్గరయ్యారు. అప్పుడు అల్లాహ్ తన దాసునికి అందజేయవలసిన దివ్య సందేశాన్ని అంద జేశాడు. మహా ప్రవక్త (స) వారి సముదాయం కొరకు యాభై వేళల నమాజును విధిగా నియమించాడు. మహా ప్రవక్త (స) అక్కడి నుంచి తిరిగి వస్తూ ఉండగా హజ్రత్ మూసా (అలైహి) కలిశారు. "మీ సముదాయం యాభై పూటల (రేయింబవళ్ళలో) నమాజు భారాన్ని మోయజాలదు. తిరిగి వెళ్ళండి, వెళ్ళి కొన్ని నమాజులు తగ్గించమని మీ ప్రభువును వేడుకోండి" అన్నారు హజ్రత్ మూసా (అలైహి). ఇలా అనేక సార్లు వెళ్ళి రాగా చివరికి ఆ సంఖ్య తగ్గుతూ తగ్గుతూ ఐదు పూటల నమాజుగా చేశాడు అల్లాహ్.

ఈ యాత్ర సందర్భాన అనేక అద్భుతాలు చూశారు మహా ప్రవక్త (స). జిబ్రయీల్ (అలైహి) ప్రవక్త (స) గారి ఎదుట మధుపానం, మరియు పాలున్న రెండు పాత్రలు ఉంచారు. మహా ప్రవక్త (స) పాల పాత్రను స్వీకరించారు. ఇది చూసి "మీరు సహజ ధర్మాన్ని



ఆశ్రయించారు" అన్నారు జిబ్రయీల్ (అలైహి). అలాగే ఆగ్రహంతో కందిపోయిన ముఖంతో నరక పాలకుడ్ని చూశారు. స్వర్గ – నరకాలను సందర్శించారు. ఓ చోట వడ్డీ తినేవాళ్ళని బాన కడుపులు కలిగి ఉండటం గమనించారు. అలాగే మరో చోట ఓ వైపు ఘుమఘుమలాడే మంచి మాంసం ఉంది. మరో వైపు కుళ్ళి కంపు కొడుతున్న మాంసం ఉంది. అయితే పర స్త్రీ, పురుషుడితో తమ కోరికలు తీర్చుకునే పచ్చి వ్యభిచారులు మంచి మాంసాన్ని వదలి కంపు కొడుతున్న మాంసాన్ని తింటున్నారు. ఈ విధంగా మహా ప్రవక్త (స) అనేక వింతలు విశేషాలు ఈ యాత్రలో చూశారు.

మహా ప్రవక్త (స) గారు ఈ ప్రయాణ సందర్భంగా ఖురైష్‌కు సంబంధించిన ఓ వర్తక బృందాన్ని చూశారు. వారి దగ్గర నీళ్ళు కూడా త్రాగారు. తెల్లవారిన తర్వాత ఆయన (స) ఈ అద్భుత విషయాలు, వింతలు విశేషాల గురించి ఖురైష్ ప్రజలకు విన్పించారు. అయితే వారంతా కలసి ముక్త కంఠంతో ఆయన్ను వ్యతిరేకించారు. హేళన చేసారు. ముహమ్మద్ (స) అబద్ధమాడుతున్నాడని తూలనాడారు. 'బైతుల్ మఖ్దిస్' ఎలా ఉంటుందో వర్ణించమని పట్టుబట్టారు.) మహా ప్రవక్త (స) 'బైతుల్ మఖ్దిస్' గురించి వివరించడమే కాక, దారిలో తారసపడిన ఆ వర్తక బృందాలు ఎప్పుడు మక్కా చేరుకుంటాయో కూడా విశదపర్చారు. ఇంత చెప్పినా కూడా వారిలో వ్యతిరేకత తప్ప మరేమి కలుగలేదు. అయితే హజ్రత్ అబూ బకర్ (రజి) మాత్రం ఈ సంఘటనను సత్యం అని నమ్మారు. ప్రజలంతా అబద్ధమని నోర్లు బాదుకుంటున్నా ఆయన వారి మాటలను ఖాతరు చేయలేదు. ఈ కారణంగానే "సిద్దీఖ్" (ధృవపరచినవాడు) అనే బిరుదు ఆయన సొంతమయ్యింది. "ఇస్రా – మేరాజ్" అనే ఈ సంఘటన దైవ సూచనల్లోని ఓ సూచన.



హదీసు మకరందం

మూలం :
హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై)

అనువాదం
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

తమ తప్పు లెరుగు వారే ధన్యులు

(1) హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ఉపదేశించారు: "ఎవరికయితే తన స్వీయ లోపాలు కానవస్తాయో, ఇతరుల లోపాలు కానరావో అతడు ధన్యుడు."

(ఈ హదీసును బజ్జార్ 'హసన్' పరంపర నుండి వెలికి తీశారు)

సారాంశం

ఇతరుల తప్పుల్ని ఎంచే ప్రయత్నంలో సమయాన్ని వృథా చేయకుండా తన స్వీయ తప్పుల్ని తెలుసుకుంటూ, వాటిని దూరం చేసుకునేందుకు కృషి చేసే వ్యక్తికి ఈ హదీసులో శుభవార్త ఇవ్వబడింది. తప్పును సరిదిద్దుకోవటం ఎంత కష్టమో గ్రహించిన వ్యక్తికి ఇతరుల తప్పుల్ని ఎంచే తీరికే దొరకదు. ఒకవేళ ఇతరుల్లో అతనికేవైనా లోపాలు కనిపించినా సాధ్యమైనంతవరకు వాటిని ఉపేక్షించేందుకు యత్నిస్తాడేగాని నలుగురిలో వారిని నవ్వులపాలు చేయడు. ఈ విధంగా ఆత్మావలోకనం చేసుకుంటూ, స్వీయ సంస్కరణపై ధ్యాస కనబరచే వారికి తీర్పు దినాన దేవుడు విస్తృతమైన నీడ గల వృక్షాన్ని ప్రసాదిస్తాడు.

(2) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించారని హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: "ఎవరైతే తన్ను తాను గొప్పవాడినని తలంచుకుని, గర్వాతిశయంతో విర్రవీగుతాడో అతడు అల్లాహ్‌ను ఆగ్రహోదగ్రుడై ఉన్న స్థితిలో కలుసుకుంటాడు."

(హకీమ్ దీనిని వెలికితీశారు. దీని ఉల్లేఖకులు విశ్వసనీయులు)

సారాంశం

గర్వం, అహంకారంతో విర్రవీగటం దేవుని అప్రసన్నతకు, దైవాగ్రహానికి కారణభూతమవుతుందని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతోంది. వాస్తవానికి తాను అందరికన్నా గొప్పవాడినని అనుకునేవాడే నేలపై నిక్కుతూ నడుస్తాడు. తలబిరుసుతనాన్ని ప్రదర్శిస్తాడు. అల్లామా నవవీ (రహ్మ.లై) దృష్టిలో – మనిషి తనను ఎంతో ఉన్నతునిగా ఊహించుకుని ఇతరుల్ని అధములుగా భావించటం, సత్యాన్ని తృణీకరించటమే అహంకారం. ఇబ్నె హజర్ మక్కీ (రహ్మ.లై) ఇలా అభిప్రాయపడ్డారు: పెద్దరికం మరియు అహంకారం రెండు విధాలుగా ఉంటుంది. వాటిలో ఒకటి అంతర్గతమైనది, రెండవది బాహ్యపరమైనది. హదీసులోని మొదటి వాక్యం అంతరంగాన్ని, రెండవ వాక్యం బాహ్యాన్ని వివరిస్తోంది. ఇవి రెండూ మహాపరాధాల్లోకే వస్తాయి. షరీయతు రీత్యా ఇవి నిషిద్ధం (హరామ్). ఎవరిలోనైతే అణువంత అహంకారం ఉంటుందో అతడు స్వర్గంలో ప్రవేశించలేడని తిర్మిజీలోని ఒక ఉల్లేఖనం ద్వారా విదితమవుతున్నది.

(3) హజ్రత్ అబూ దర్దా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "నిస్సందేహంగా ఇతరులకు శాపనార్థాలు పెట్టేవారు ప్రళయదినాన సిఫారసు చేసే, సాక్ష్యం ఇచ్చే అర్హతను కోల్పోతారు." (ముస్లిం)

సారాంశం

అదేపనిగా ఇతరుల్ని శపిస్తూ, ఇతరుల చర్యలను అనవసరంగా ఖండిస్తూ ఉండేవారిని అల్లాహ్ ఇష్టపడడనీ, తీర్పుదినాన అటువంటి వారు చేసే సిఫారసుల్ని, వారు ఇచ్చే సాక్ష్యాలను అల్లాహ్ ఒప్పుకోడని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. ఎందుకంటే అకారణంగా అన్యుల్ని ఆడిపోసుకునేవారు, అన్యుల ఉనికిని సహించలేనివారు పాపాత్ములు (ఫాసిఖ్‌లు) అవుతారు. కాగా; పాపాత్ముల సిఫారసు స్వీకారయోగ్యమవదు. ఇలాంటి వారు దైవమార్గంలో అమరగతినొందినప్పటికీ, ఇతరుల కోసం సిఫారసు చేసే అర్హతను పొందలేరని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

(4) హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైతే ఒకరి చేత జరిగిపోయిన పాపాల్ని రట్టుచేసి రాద్ధాంతం చేస్తాడో అతను స్వయంగా ఆ పనికి పాల్పడి మరీ చస్తాడు." (తిర్మిజీ దీనిని ఉల్లేఖించి, ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. దీని పరంపరలో అంతరాయముంది.).

సారాంశం


సాటి ప్రజల తప్పులను, పాపాలను అసలు ఎత్తి చూపకూడదని దీని భావం కాదు. కాకపోతే పబ్లిగ్గా వారి పాపాలను ప్రస్తావించి, నలుగురిలో నవ్వులపాలు చేసే యత్నం మాత్రం చేయకూడదు. ఎవరయితే ఇలాంటి దుష్ట సంకల్పం పూనుకుని ఉంటారో వారికీ అదే గతి పడుతుంది. సాధ్యమైనంతవరకు జనుల లోపాలను మరుగుపరచాలన్నది దేవుని అభిమతం. ఎందుకంటే ఆయన 'సత్తార్' – దాసుల లోటుపాట్లను మరుగుపరచేవాడు! ఎవరిలోనయితే ఈ లోపాలను మరుగుపరచే ఉదార స్వభావం ఉంటుందో వారి లోపాలను తీర్పుదినాన దేవుడు మరుగుపరుస్తాడు. వారి పరువు ప్రతిష్ఠలను కాపాడే బాధ్యతను అల్లాహ్ స్వయంగా తీసుకుంటాడు.

PAGE 10-11.pdf 1/9/08 8:33:03 PM

ఖుర్‌ఆన్ పాఠం



సంపూర్ణ విధేయతకు ప్రతిరూపం
ఆ మహనీయుని జీవితం



-అబ్దుల్ ఖాదర్ ఉమ్రి

అంతే. ఓ పెద్ద అగ్ని గుండం రగిలించబడుతుంది. దైవ ప్రవక్త ఇబ్రాహీంను భగభగమండే అగ్ని గుండంలో విసిరి వేయడం జరిగింది. జీవన్మరణాలకు అధిపతి అయిన అల్లాహ్ **"ఓ అగ్నీ! నా నేస్తం ఇబ్రాహీం కోసం చల్లారిపో, క్షేమకరంగా మారిపో"** అని ఆదేశిస్తాడు. మండే జ్వాలలు ఆరిపోతాయి. ఇబ్రాహీం (అలైహిస్సలాం) సురక్షితంగా అగ్ని గుండం నుండి బయటపడతారు. ఈ విధంగా విశ్వప్రభువు దుర్మార్గుల దుష్టప్రయత్నాలను వమ్ము చేసి తన ప్రియదాసుడ్ని కాపాడుతాడు.

జనుల్ని నిజప్రభువు వైపుకు పిలువడమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్న ఇబ్రాహీం (అలైహిస్సలాం) స్వస్థలాన్ని కూడా వదలిపెడ్తారు. సిరియా, పాలస్తీనా, ఈజిప్టు ...ఇంకా మరెన్నో ప్రాంతాలలో పర్యటిస్తారు. ప్రజలకు ఏకేశ్వరోపాసనా సందేశాన్ని అందజేస్తూ ఉంటారు. సత్యధర్మ ప్రచార మార్గంలోనే ఆయన ముసలివారయిపోతారు. ముసలితనంలో **"ఓ ప్రభూ! నాకు సచ్ఛీలుడైన ఓ కుమారుడ్ని ప్రసాదించు"** అని ఎంతో దీనంగా అల్లాహ్‌ను వేడుకుంటారు. అల్లాహ్ తన ప్రియదాసుడి మొరను ఆలకించి ఒక బాలుడ్ని అనుగ్రహిస్తాడు. ఆ బాలుడే దైవ ప్రవక్త ఇస్మాయీల్ (అలైహిస్సలాం).

విశ్వప్రభువైన అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను ఇంకొక కఠిన పరీక్షకు గురిచేస్తాడు. తన భార్య హాజిరాను, ముద్దుల కొడుకు ఇస్మాయీల్‌ను కటిక కొండల్లో వదలిపెట్టి రావాలని ఆజ్ఞాపిస్తాడు. ఎందుకు? అని అడగరు ఆ మహనీయుడు. జనావాసంలేని ఆ ప్రదేశంలో తన భార్యా, పసిపిల్లవాడి సంరక్షణా బాధ్యత ఎవరు వహిస్తారు? అని ఆలోచించరు. తన ప్రభువు ఆజ్ఞను శిరసావహిస్తూ, ఆయన మీదే అపార నమ్మకంతో తన భార్యాబిడ్డను కొండల నడుమ వదలిపెట్టుతారు. కారుణ్య ప్రభువైన అల్లాహ్ ఆ తల్లీబిడ్డను సంరక్షిస్తాడు. వారి కోసం జమ్ జమ్ నీటి ఊటను సృష్టిస్తాడు. ఈ విధంగా తన ప్రసన్నత కోసం సంబంధ బాంధవ్యాలను త్యజించిన వారికి తాను ప్రపంచ జీవితంలోనూ శుభాలను ప్రసాదిస్తానని, వారి ఊహకు కూడా అందనటువంటి మార్గాల ద్వారా వారికి ఉపాధి అనుగ్రహిస్తానని లోకానికి వెళ్ళడి చేశాడు.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఓ రోజు రాత్రి కలగంటారు – లేక లేక కలిగిన ముద్దుల కొడుకును తన చేతులతోనే దైవమార్గంలో బలి ఇస్తున్నట్లు! ఈ విషయం తన పుత్ర రత్నానికి తెలియజేస్తారు. పసితనం నుంచే దైవ విధేయతాభావం, త్యాగభావాన్ని పుణికి పుచ్చుకున్న ఆ బాలుడు ఏ మాత్రం చలించకుండా ఇలా అంటాడు: **"నాన్నా ! ఇదే దైవాజ్ఞ అయితే మీకు లభించిన ఆదేశాన్ని మీరు నిస్సందేహంగా అమలుపరచండి. ఇన్షా అల్లాహ్ (దైవం తలిస్తే) మీరు నన్ను సహనశీలిగా చూస్తారు".**

ఇప్పుడు అల్లాహ్ ఆజ్ఞను శిరసావహిస్తూ కన్న కొడుకుని బలివ్వడానికి తండ్రి సిద్ధమయ్యాడు. దైవ ప్రసన్నత కోసం బలి అవడానికి బిడ్డ అంగీకరించాడు. నిస్సందేహంగా ఇదొక కఠిన పరీక్ష. గొప్ప త్యాగం. ఇబ్రాహీం (అలైహిస్సలాం) కొడుకుని బోర్లా పడవేస్తారు. అప్పుడు అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను పిలిచి **"ఓ ఇబ్రాహీం! నీవు కలను నిజంచేసి చూపావు"** అంటాడు. ఈ పెద్ద ఖుర్బానీకి పరిహారంగా పొట్టేలను ఇచ్చి ఇస్మాయీల్(అ) ను తప్పిస్తాడు. తండ్రి కుమారులకు భావితరాలలో శాశ్వతంగా కీర్తి ప్రతిష్ఠలను ప్రసాదిస్తాడు.

ఈ విధంగా దైవప్రవక్త ఇబ్రాహీం (అ) మనసా, వాచా, కర్మణా తాను తన తల్లిదండ్రులు, ఆప్తులు, భార్యాబిడ్డలు, ఆస్తి అంతస్తులు... అన్నిటికన్నా ఎక్కువగా అల్లాహ్‌ను ప్రేమిస్తున్నానని, ఆయన ప్రసన్నత కోసం మనోకాంక్షల్ని, ప్రాపంచిక వ్యామోహాన్ని, బాంధవ్యాలను త్యజించడానికి, తాను ఎల్ల వేళలా సంసిద్ధమేనని లోకానికి వెల్లడి చేశారు.

అందుకే అల్లాహ్ ఆ మహామనీషిని సమస్త మానవులకు నాయకునిగా ఎన్నుకున్నాడు. "ముస్లిం (సంపూర్ణ విధేయుడు) అనే బిరుదును ఆయనకు అనుగ్రహించాడు.

దైవప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) త్యాగమయ జీవితంలో వంశపారంపర్యంగా వస్తున్న ముస్లిములకు, నవ ముస్లిములకు గొప్ప సందేశం ఉంది. ఉత్తమ ఆదర్శముంది.

(1) విగ్రహారాధకుల కుటుంబంలో జన్మించినప్పటికీ విశ్వప్రభువైన అల్లాహ్‌ను తన నిజ యజమానిగా, పోషకునిగా, సంరక్షకునిగా స్వీకరించినవారు, ఆయనకు విధేయత చూపేవారు ముస్లిములుగానే పరిగణించబడతారు.

(2) ధనవ్యామోహపరులు, పదవుల కోసం ప్రాకులాడేవారు, మనోవాంఛలకు బానిసలయినవారు, బూటకపు గౌరవప్రతిష్ఠల కోసం వెంపర్లాడే వారు, అంధవిశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండేవారు, లోకం దృష్టిలో ముస్లింలుగా చెలామణీ అవుతారేమోగాని అల్లాహ్ దృష్టిలో మాత్రం ముస్లిములుగా లెక్కించబడరు.

(3) అల్లాహ్ ఆదేశాలను శిరసావహిస్తే లేక ఫలానా దైవాజ్ఞను పాటిస్తే పెద్దలు ఒప్పుకోరని, తల్లిదండ్రులు వ్యతిరేకిస్తారని, ప్రభుత్వానికి కోపం వస్తుందని, కష్టనష్టాలకు గురికావలసి వస్తుందని, వ్యాపారం మందగిస్తుందని, ఆదాయం తగ్గిపోతుందని, ఉద్యోగం ఊడిపోతుందని, భార్యా పిల్లల కోర్కెలను తీర్చలేమని అనే వారికి తాము ముస్లిములమని చెప్పుకునే హక్కు లేదు. **"ముస్లిం"** అంటేనే అల్లాహ్ తరఫు నుండి లభించే ప్రతి ఆదేశాన్నీ శిరసావహించేవాడు.



ఇండియా దటీజ్ భారత్

(3 వ పేజీ తరువాయి భాగం)

1909 లో ప్రవేశ పెట్టబడిన మింటో మార్లే (Minto-Marle Reforms) సంస్కరణలైనా, 1919 నాటి మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ చట్టం (Montague - Chemsford Act) అయినా, 1935 నాటి భారత ప్రభుత్వ చట్టమైనా (Government of India Act)– అవన్నీ బ్రిటిష్ పార్లమెంటు ద్వారా ఇంపోర్ట్ అయిన చట్టాలే. అయినప్పటికీ అవి భారత రాజ్యాంగ క్రమ వికాసానికి మార్గం సుగమం చేసిన వాస్తవాన్ని మాత్రం ఎవరూ కాదనలేరు.

1947 ఆగస్టు 14వ తేదీన ఇండియాకు అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చింది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ భారత తొలి ప్రధాని అయ్యారు. ఇల్లలకలాగే పండగైపోదుకదా! అప్పటికి దేశమంతా అల్లకల్లోలంగా ఉంది. దేశంలో సుస్థిరత, సువ్యవస్థ కోసం ఒక సంవిధానం అవసరం. డా. రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్తు నియమించబడింది. డా.బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాతగా తన కర్తవ్యాన్ని అమోఘంగా నిర్వర్తించారు. ఈ తతంగమంతా ఓ కొలిక్కి వచ్చేసరికి రెండేండ్లు పట్టింది. మొత్తానికి ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామిక దేశానికి, 395 నిబంధనలతో కూడిన అతి పెద్ద లౌకిక రాజ్యాంగ ముసాయిదా రూపు దిద్దుకుంది.

జనవరి 26 నే ఎందుకు?

అప్పటికే జనవరి 26వ తేదీ ప్రాముఖ్యతను సంతరించుకుని ఉంది. అంతకుముందు 1929 డిశంబరు 31 వ తేదీ అర్ధరాత్రి లాహోర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సదస్సులో "ఇక మీదట ప్రతి ఏటా జనవరి 26న త్రివర్ణ పతాకం ఎగురవేసి భారత స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటాం" అని తీర్మానించారు. ఆ తీర్మానానికి చిహ్నంగా 1950 జనవరి 26వ తేదీన భారత దేశాన్ని "సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక గణతంత్ర రాజ్యం" గా ప్రకటించారు. భారత తొలి రాష్ట్రపతిగా డా. రాజేంద్ర ప్రసాద్ ఎన్నుకోబడ్డారు. ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మన రాజ్యాంగవ్యవస్థ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా – సాఫీగా– నడుస్తోంది. కాకపోతే అవసరాల కనుగుణంగా రాజ్యాంగంలో ఎన్నో సవరణలు జరిగాయి.

ఈ యాభై ఏండ్లలో 12 మంది రాష్ట్రపతులు వచ్చారు. పదవిలో ఉండగానే ఇద్దరు రాష్ట్రపతులు (డా.జాకిర్ హుస్సేన్, శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్) చనిపోయారు. కాని ఎన్నడూ రాజ్యాంగ సంక్షోభం ఏర్పడలేదు. అప్పుడప్పుడూ ప్రధానమంత్రికీ – రాష్ట్రపతికి మధ్య "అనిర్వచనీయమైన గంభీరమౌనం" లాంటిది ఏర్పడినా ఏ రాష్ట్రపతి కూడా అనవసరంగా పార్లమెంటరీ వ్యవస్థలో తలదూర్చి తలనొప్పి కలిగించలేదు. ఏ రాష్ట్రపతిని కూడా అభిశంసన (Impeachment) ద్వారా తొలగించవలసిన అగత్యం పార్లమెంటుకు ఏర్పడలేదు. మిలటరీ వాళ్లు తమ బారకాసులకే పరిమితమైనారు తప్ప దుర్బుద్ధితో ఏనాడూ చట్టసభలవైపు కన్నెత్తి చూడలేదు. భారతదేశంలో ప్రజాస్వామిక వ్యవస్థతో పాటు, రాజ్యాంగవ్యవస్థ బలంగా వ్రేళ్లూనుకుంటోందని చెప్పటానికి ఇంతకన్నా నిదర్శనం అక్కరలేదేమో!

చెప్పుకోండి చూద్దాం

– అబుల్ హసన్

? 'ఇబ్రాహీమ్' అన్న పేరు గల సూరా ఏ పారాలో ఉంది?

జవాబు : **13 వ పారాలో.**

? ఖుర్‌ఆన్ ప్రకారం ఏ ఏ నెలలు పవిత్రం?

జవాబు : **ముహర్రమ్, రజబ్, జుల్‌ఖఅదా, జుల్‌హిజ్జ.**

? సఫా మర్వాల మధ్య 'సయీ' కి కారకురాలైన స్త్రీమూర్తి ఎవరు?

జవాబు : **హాజ్రత్ హాజిరా (అలైహస్సలాం).**

? అరఫా దినం ఏ రోజు వస్తుంది?

జవాబు : జుల్‌హిజ్జ 9వ తేదీన (ఈదుల్ అజ్‌హాకు ముందు రోజు).

? ఇస్లామీయ కేలండరు ప్రకారం మొదటి నెల మరియు చివరి నెల పేర్లేమిటి?

జవాబు : **మొదటి నెల: ముహర్రమ్, చివరి నెల: జిల్‌హజ్జా.**

? ప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) స్వదేశమైన ఇరాక్‌ను వదలి ఏ దేశానికి వలస (హిజ్రత్) పోయారు?

జవాబు : షామ్ (సిరియా).

? ముహర్రం ఏ ఏ తేదీల్లో ఉపవాసముండాలి?

జవాబు : 9, 10 ముహర్రం లేదా 10,11 ముహర్రం తేదీల్లో.

? ప్రవక్త మూసా (అలైహిస్సలాం) వారి అనుయాయుల్ని దేవుడు ఏ నెలలో ఫిర్‌ఔన్ చెర నుండి విడిపించాడు?

జవాబు : ముహర్రం మాసం 10వ తేది.

? హజ్జ్ దినం అని ఏ రోజుని అంటారు?

జవాబు : అరఫా రోజుని.

? ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) హిజ్రత్ చేసి వెళుతూ చేసిన దుఆ ఏది?

జవాబు : "రబ్బి హబ్‌లీ మినస్సాలిహీన్" (ప్రభూ! నాకు శీలవంతుడైన ఒక కుమారుణ్ణి ప్రసాదించు.

PAGE 12-13.pdf 1/9/08 8:34:33 PM

IPC వార్తలు

రమజాన్ పోటీల విజేతలకు బహుమతులు



ప్రపంచమంతటా జాతులలో, వర్గాలలో ఉన్న వైవిధ్యం దైవికమని, పరస్పర పరిచయం మరియు వ్యక్తిత్వ పరిరక్షణ కోసం దేవుడే ఈ విధమైన వ్యవస్థను ఏర్పరచాడని **IPC** సందేశ విభాగం నిర్వాహకులు **అబూ అనస్** వక్కాణించారు. 10-12-07వ తేదీన **IPC** కేంద్ర కార్యాలయంలో జరిగిన **"రమజాన్ పోటీల విజేతలు: బహుమతుల ప్రదానోత్సవం"** కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కువైట్ వివిధ భాషా వర్గాలకు, విభిన్న జాతులకు సంగమంగా ఉందని, జీవనోపాధి కోసం ఇక్కడకు వచ్చే సోదరుల్లో ఇస్లాం పట్ల సరైన అవగాహనను కలిగించే ఉద్దేశంతో తాము ప్రతి సంవత్సరం ఈ సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

10-12-07 వ తేదీ సోమవారం రాత్రి 7:00 గంటలకు జరిగిన ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం **IPC** ప్రబోధకులు ముజాహిద్ గుమాందర్ ఖుర్‌ఆన్ పారాయణంతో మొదలయింది. **షేఖ్ అహ్మద్ ఓనామ్** ముఖ్య అతిథిగా విచ్చేశారు. **IPC** తమిళ ప్రబోధకుడు అబ్దుల్ ముసవ్విర్ ఈ కార్యక్రమ వివరాలను తెలుపుతూ మొత్తం ఎనిమిది భాషా వర్గాల మధ్య పోటీలు నిర్వహించబడ్డాయని, ఒక్కో భాషకు 8 బహుమతుల చొప్పున కేటాయించబడ్డాయని చెప్పారు. పోటీలలో విజేతలైన వారితో కలసి అందరూ విందు ఆరగించారు.

తెలుగు విజేతలు

1. శ్రీ ఆర్. పెంచలరెడ్డి - 50 దీనార్లు
2. శ్రీ అబ్దుల్లా (వీర వెంకట్) - 50 దీనార్లు
3. శ్రీ డి.రమణ - 30 దీనార్లు
4. కుమారి ఫాయిజా - 30 దీనార్లు
5. శ్రీ దిడ్ల రాజు - 20 దీనార్లు
6. శ్రీ ఇబ్రాహీం - 20 దీనార్లు
7. శ్రీ ఎస్. ఇ. పెంచలరెడ్డి - 20 దీనార్లు



రోజు వాస్తవికత

◆ మౌలానా అబుల్ బయాన్ హమ్మాద్ ఉమ్రీ

ఇకపోతే ప్రతివారంలో రెండు దినాలు (సోమవారం, గురువారం) ఉపవాసాలుండటం కూడా దైవప్రవక్త సంప్రదాయమే. ఈ రెండు రోజుల ఉపవాసాల గురించి ప్రశ్నించగా దైవప్రవక్త(స) ఇలా సమాధానమిచ్చారు.

"సోమవారం నాడు, గురువారం నాడు దాసుల కర్మలు దైవసన్నిధిలో సమర్పించ బడతాయి. అందుకే నా కర్మలు నేను ఉపవాసమున్న స్థితిలో అల్లాహ్ సమక్షంలో సమర్పించబడాలని నేను కోరుకుంటున్నాను." చంద్రమాసం ప్రకారం ప్రతి నెలా 13,14,15 తేదీలలో ఉపవాసముండటం కూడా సున్నతే.

ముహర్రమ్ 10 వ తేదీకి గల ప్రాధాన్యత రీత్యా ఆ రోజున ఉపవాసముండటం మస్నూన్ అవుతుంది. మహాప్రవక్త(స) మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేసినప్పుడు అక్కడి యూదులు ముహర్రమ్ నెల పదవ తేదీన ఉపవాసం పాటించటం గమనించి కారణ మడిగారు. ఆ రోజున అల్లాహ్ ఫిరౌనీయుల బారి నుంచి దైవప్రవక్త మూసాను, ఆయన జాతివారిని కాపాడి ఫిరౌన్‌ను అతని సైన్యం సమేతంగా సముద్రంలో ముంచి వేశాడనీ, అందుకే తాము కృతజ్ఞతా సూచకంగా ఆ రోజు ఉపవాసం పాటిస్తున్నామని యూదులు చెప్పారు. ఇది విని దైవప్రవక్త(స) "మేము మూసాకు మీకన్నా మరింత దగ్గరగా ఉన్నాము. కాబట్టి మేము కూడా ఈ ఉపవాసం పాటించాల్సిందే" అని అభిప్రాయపడ్డారు. అందుచేత ముహర్రమ్ 10 వతేదీ ఉపవాసం కూడా మస్నూన్ (పవక్త విధానం)గా ఖరారయింది. దైవప్రవక్త(స) తాను స్వయంగా ఈ ఉపవాసం పాటించటమే గాకుండా, తన సహచరులకు ఈ రోజా పాటించమని తాకీదు చేసేవారు.

తన పవిత్ర జీవితపు చివరి సంవత్సరం కూడా ఆయన(స) ఆనవాయితీ ప్రకారం ఆషూరా ఉపవాసం పాటించారు. తదుపరి



ప్రియసహచరులు వచ్చి "ఓ దైవ ప్రవక్తా! సాధారణంగా తమరు ధార్మిక వ్యవహారాలలో గ్రంథవహుల పద్ధతులకు భిన్నంగా వ్యవహరించమని మమ్మల్ని ఆదేశిస్తూ ఉంటారు కదా! మరలాంటప్పుడు మనం కూడా యూదుల మాదిరిగా ముహర్రమ్ పదవతేదీ నాడే (ఒకే రోజు) ఉపవాసం పాటించటంలోని ఔచిత్యం ఏమిటి? అని సందేహపడ్డారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) "ఒకవేళ నేను గనక వచ్చే ఏడాది వరకూ జీవించి ఉంటే ముహర్రమ్ **'9వ తేదీన కూడా ఉపవాసం ఉంటాను"** అన్నారు. అయితే మరుసటి సంవత్సరం ముహర్రమ్ 10వ తేదీ రాక మునుపే ఆయన పరమపదించారు.

అంటే ముహర్రమ్ 10వ తేదీన కాకుండా 9వ తేదీన ఒక్క రోజు ఉపవాసం ఉంటే సరిపోతుందని దీని అంతరార్థం ఎంతమాత్రం కాదు. అందుకే ప్రవక్త వారి ప్రవచనం వెలుగులో ఆయన ప్రియ సహచరులు, హదీసువేత్తలు ఒక నిర్ధారణకు వచ్చారు. అదేమంటే–

ఒక పద్ధతి:– ముహర్రమ్ 9వ తేదీ, 10వ తేదీన రెండు రోజులు ఉపవాసముండాలి.

లేదా **రెండవ పద్ధతి:–** ముహర్రమ్ 10 వ తేదీన, 11 వ తేదీన రెండు రోజులు.

లేదా **మూడవ పద్ధతి:–** ముహర్రమ్ 9,10,11 వ తేదీలు– మూడు రోజులు.

ముహర్రమ్ 10వ తేదీ ఉపవాసం పాటించిన పక్షంలో గత సంవత్సరంలో వారివల్ల జరిగిన చిన్న చిన్న పాపాలన్నీ క్షమించబడతాయని మహనీయ ముహమ్మద్(స) వారు చెప్పారు.

ఇస్లామీయ కేలండరు ప్రకారం సంవత్సరంలోని మొదటి నెల, ఆఖరి నెల – రెండూ కూడా త్యాగనిరతికి తార్కాణంగా నిలిచాయి. దైవప్రవక్త ఇబ్రాహీం ముద్దుల కుమారుడైన హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) జిల్‌హజ్జ నెలలో దైవమార్గంలో బలికావటానికి సంసిద్ధమవగా, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ముద్దుల మనవడైన ఇమామ్ హుస్సైన్ (రజి) ముహర్రమ్ మాసంలో దైవమార్గంలో అమరగతి నొందడానికి బయలుదేరారు. అదీ విచిత్రం, విశేషం!

అంటే హిజ్రీ సంవత్సరపు మొదటి నెల ఒక గొప్ప త్యాగాన్ని జ్ఞాపకం చేస్తుండగా, చివరి నెల మరో గొప్ప త్యాగానికి ప్రతిరూపంగా నిలిచి విశ్వాసుల అంతరంగంలోని సత్యాగ్ని కణాన్ని రాజేస్తూ ఉంటాయి. నిరంకుశ నియంతృత్వ, ఫాసిస్టు పోకడలను నిరసించేవారికి, త్యాగశీలురైన వారికి ఇందులో గొప్ప సంకేతం ఉంది.

('రాహె ఏతెదాల్'
ఫిబ్రవరి - 2007 సౌజన్యంతో)

రచయిత
జామియా దారుస్సలామ్, ఉమరాబాద్ గౌరవ అధ్యాపకులు

PAGE 14-15.pdf 1/9/08 8:36:30 PM

ముహర్రమ్ పవిత్ర

సృష్టికర్త జగతిని సృష్టించిన మీదట సూర్య చంద్రులను కూడా సృష్టించాడు. అప్పటి నుంచే రేయింబవళ్ళ వ్యవస్థ కూడా మొదలయింది. రోజులు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా, సంవత్సరాలు శతాబ్దాలుగా, శతాబ్దాలు సహస్రాబ్దులుగా పరిణామం చెందాయి. ఆది కాలం నుండి నేటి వరకు ఎన్ని శతాబ్దాలు గడిచాయన్నది ఆ సృష్టికర్తకే ఎరుక. అయితే కాలచక్రం తిరగటం మొదలైనప్పుడే కొన్ని మాసాలకు గల ఘనత్వాన్ని విశ్వప్రభువు నిర్ధారించాడు. వాటిలో రమజాన్ మాసం అత్యంత మహత్తు గలదైతే మరో నాలుగు మాసాలు కూడా పరమ పవిత్రమైనవని పేర్కొనటం జరిగింది. ఆ నాలుగు మాసాలు ఇవి: **(1) జీ-ఖఅద (2) జిల్‌హజ్జ (3) ముహర్రమ్ (4) రజబ్.**

ఆ మాటకొస్తే ప్రతినెలా, ప్రతిదినం గౌరవ ప్రదమైనవే. అనుదినం శాంతి భద్రతలను పరి రక్షించాల్సిందే. అయితే రమజాన్‌తోపాటు నాలుగు మాసాల్లో మాత్రం శాంతి భద్రతల పట్ల మరింత జాగ్రత్త వహించాలి. ఈ నాలుగు మాసాల్లో కయ్యానికి కాలు దువ్వకుండా, రక్తపాతం జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) కు పూర్వం అరబ్బులు యధేచ్ఛగా హత్యలకు, లూటీలకు పాల్పడే వారన్న సంగతి తెలిసిందే. కాని ఏడాదిలో నాలుగు మాసాలు మాత్రం ఎలాంటి రక్తపాతం జరగరాదని, ఆ నాలుగు మాసాలలో తాము ప్రశాంతంగా జీవితం గడపాలని నిర్ణయించుకున్నారు. అంతవరకూ బాగానే వుంది. కాని క్షణికావేశానికి లోనైన అనాగరిక అరబ్బులు పవిత్ర (నిషిద్ధ) మాసాలన్న సంగతిని మరచిపోయి కత్తులు దూసుకునేవారు. పైగా ఆ నిషిద్ధ మాసాలను తమ ఇష్టానుసారం వెనక్కి ముందుకు జరుపుకునేవారు. ఉదాహరణకు: ముహర్రమ్ నెలలో హద్దుల్ని అతిక్రమించి, దాన్ని రబీవుల్ అవ్వల్ నెలగా పరిగణించేవారు. రబీవుల్ అవ్వల్ నెల వచ్చినప్పుడు దాన్ని ముహర్రమ్ నెలగా జమ కట్టుకునేవారు. ముష్రిక్కులైన అరబ్బుల ఈ తప్పుడు వైఖరిని ఖుర్‌ఆన్ 'నసీ' గా పేర్కొని దాన్ని ఆజ్ఞోల్లంఘనకు పరాకాష్ఠగా అభివర్ణించింది.

"నసీ' అవిశ్వాసంలో మరో అవిశ్వాసపు (వెకిలి) చేష్ట. దాని ద్వారా ఈ అవిశ్వాసులు మార్గభ్రష్టత్వంలో పడవేయబడుతున్నారు. ఒక సంవత్సరం ఒక మాసాన్ని ధర్మసమ్మతం చేసుకుంటారు. మరో సంవత్సరం దానినే నిషేధించుకుంటారు. మొత్తమ్మీద అల్లాహ్ నిషిద్ధం చేసిన మాసాల సంఖ్యను పూర్తి చేశామని అనిపించుకుని, అల్లాహ్ నిషేధించిన వాటిని ధర్మసమ్మతం చేసేసుకుంటారు. వారి పాపిష్టి పనులు వారికి అందమైనవిగా చూపించబడ్డాయి. అల్లాహ్ అవిశ్వాసజనులకు సన్మార్గం చూపడు." (తౌబా -37)

ఈ 'నసీ' మూలంగా పవిత్ర మాసాలు తమ యధాస్థితి నుండి తొలగిపోయినై. నిజానికి ముహర్రమ్ నెలతో నూతన సంవత్సరం మొదలై జిల్‌హజ్జ నెలతో ముగియాలి. ఈ వ్యవస్థను అనాగరిక అరబ్బులు చిందరవందర చేసేశారు. మహాప్రవక్త(స) రాకతో ఈ 'వికృత పోకడ' (నసీ) కు చరమగీతం పాడబడింది. దైవ దౌత్యం అందిన తొలి రోజుల నుంచే ఈ వ్యవస్థను క్రమబద్ధం చేయటానికి మహాప్రవక్త (స) ప్రయత్నించేవారు. ఎట్టకేలకు హజ్ యాత్ర విధిగా చేయబడే నాటికి ఈ నెలల క్రమబద్ధీకరణ ఓ కొలిక్కి వచ్చింది. ఆ మాటే తన అంతిమ హజ్‌యాత్ర సందర్భంగా మహాప్రవక్త (స) అన్నారు:

"నిశ్చయంగా కాలం తిరిగి తిరిగి, అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి అసలు సిసలు స్థితిలోకి వచ్చేసింది. సంవత్సరం 12 మాసాలతో కూడినదై ఉంటుంది. అందులో నాలుగు మాసాలు గౌరవప్రదమైనవి. వాటిలో మూడైతే నిరంతరాయంగా వస్తాయి- జీఖఅద, జిల్‌హజ్జ, ముహర్రమ్- నాల్గోది రజబ్. ఇది జమాదివుల్ ఆఖిర్‌కి-షాబాన్‌కి మధ్యన ఉంటుంది సుమా! ముజర్ తెగవారు ఈ నెలను ఇతరులకన్నా ఎక్కువగా గౌరవిస్తారు".

(ముత్తఫఖున్ అలై)

ఆరాధనలలో ప్రతి ఒక్కదానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అంటే కొన్ని ఫర్జ్ అయితే మరికొన్ని సున్నత్, ఇంకొన్ని నఫిల్ ఆరాధనలు అయి ఉంటాయి. ఉదాహరణకు:- నమాజులనే తీసుకోండి. ఫజ్ర్ మరియు అస్ర్ నమాజులు మినహా జుహ్ర్, మగ్రిబ్, ఇషా నమాజులలో 'ఫర్జ్'కు ముందు, తరువాత కూడా 'సున్నతులు' ఉన్నాయి. అయితే ఫజ్ర్ అస్ర్‌లలో 'ఫర్జ్' కి ముందైతే సున్నతులున్నా యిగాని ఫర్జ్ తర్వాత సున్నత్ నమాజుగానీ, నఫిల్ నమాజు గానీ లేదు. కాకపోతే నమాజె జనాజా (అంత్యక్రియల నమాజ్) చేయవచ్చు.

రమజాన్ ఉపవాసాలనబడే ఆరాధనలు కూడా అంతే. రమజాన్‌లోని ఫర్జ్ ఉపవాసాలతో పాటు, ఒక ఏడాది కాలంలో కొన్ని సున్నత్ ఉపవాసాలు కూడా షరీయత్‌లో నిర్ధారించబడ్డాయి. ఈదుల్ ఫిత్ర్ అనంతరం షవ్వాల్ మాసంలో 6 రోజుల ఉపవాసాలు 'మస్నూన్'గా ఖరారు చేయబడ్డాయి. ఈ ఆరు ఉపవాసాలు నిరంతరం పాటించినా ఫరవాలేదు. మధ్యలో తెరిపి ఇచ్చి పాటించినా ఫరవాలేదు.

అలాగే జిల్‌హజ్జా నెల మొదటి దశకంలో (ఈదుల్ అజ్హాకు పూర్వం) మొదటి తేదీ నుండి 9 వ తేదీ వరకు ఉపవాసాలుండటం సున్నత్. అయితే జిల్‌హజ్జ 9 వ తేదీ ఉపవాసం అత్యంత ప్రాముఖ్యం గలది. ఈ ఉపవాసం పాటించే వారి వల్ల గత సంవత్సరం జరిగిన తేలికపాటి తప్పులు, తరువాతి సంవత్సరంలో జరిగే తేలికపాటి పాపాలు (మొత్తం రెండేండ్ల చిన్న చిన్న పాపాలు) క్షమించబడతాయి. అయితే జిల్ హజ్జ్ నెలలో సత్కర్మలకు లభించే పుణ్యఫలం దృష్ట్యా మహనీయ ముహమ్మద్(స) వారు మొత్తం 9 రోజులు కూడా ఉపవాసం ఉండేవారు.

IPC వార్తలు



ఈదుల్ అజ్హా
మానవత పాలిట గొప్ప వరప్రసాదం

" **'ఈదుల్ అజ్హా'** (త్యాగోత్సవం) మానవత పాలిట ముమ్మాటికీ కారుణ్య ప్రదాయిని. ఈ ఉత్సవానికి ఒక రోజు ముందు **'అరఫా దినం'** కలదు. ఆ దినం యౌముల్ అజీం (మహా రోజు) గా ఖరారయింది. ఎందుకంటే ఆనాడు మానవాళిపై విశ్వప్రభువు తన దయానుగ్రహాలను అపారంగా కురిపించాడు. ఆనాడు **మహాప్రవక్త(స)** వారు మానవులపై మోపబడివున్న బరువులను దించారు. శృంఖలాలను త్రెంచారు. వడ్డీ పిశాచం పీచమణిచారు. మానవ హక్కుల అపురూపమైన ఛార్టర్‌ను విడుదల చేశారు. అందుకే కృతజ్ఞతా సూచకంగా మనం ఈ పండుగ చేసుకుంటున్నాము" అని **IPC** దావా డిపార్ట్‌మెంట్ మేనేజర్ **షేఖ్ ఖాలిద్ అస్సబా** (అబూ అనస్) వక్కాణించారు. **IPC** ఆధ్వర్యంలో తెలుగు కమ్యూనిటీ వారు జరుపుకున్న బక్రీద్ పండుగ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

19-12-07 వ తేదీ బుధవారం నాడు **IPC** ప్రబోధకులు **మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ** సారథ్యంలో, కువైట్‌లోని ఖైతాన్ పార్క్‌లో **'త్యాగోత్సవం'** ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది.

IPC ప్రబోధకులు **మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ** సారథ్యంలో అందరూ ఈద్ నమాజ్ చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ, తమకు ప్రియాతి ప్రియమైన వస్తువును దైవమార్గంలో సంతోషంగా సమర్పించడానికి సమాయత్తం కానంతవరకు అది దైవసన్నిధిలో స్వీకృతిని పొందదని చెప్పారు. అంతకుముందు **IPC** దాయి **షేఖ్ బిలాల్** తెలుగులో ఉపన్యసించారు.

ఈద్ సంబరాలలో భాగంగా క్రీడా విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కండక్ట్ చేయబడ్డాయి. ఈ కార్యక్రమానికి **నెలవంక** ఎడిటర్ శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ సారథ్యం వహించారు. విజేతలకు బహుమతులు ఇవ్వబడ్డాయి.

IPC దాయి **మౌలానా షేఖ్ అబ్దుస్సలామ్ ఉమ్రీ** ఆహూతులకు స్వాగతం పలకగా, **IPC** దాయి **షేక్ నజీబుద్దీన్** అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంబరాలలో పాల్గొన్న వారిలో ఇతర దాయిలు, దాయియాతులతో పాటు నవముస్లిం సోదర సోదరీమణులు, తెలుగు ఉర్దూ కమ్యూనిటీలకు చెందిన స్త్రీ పురుషులు కూడా ఉన్నారు.



PAGE 16-17.pdf 1/9/08 8:26:00 PM



IPC వార్తలు

IMA - IPC ఆధ్వర్యంలో

వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొన్న బాలలకు బహుమతి ప్రదానోత్సవం



విద్యార్థులలో శీలనిర్మాణం కోసం కువైట్‌లోని **ఇండియన్ ముస్లిం అసోసియేషన్** (IMA) ఏటేటా నిర్వహిస్తున్న **"వేసవి శిక్షణా తరగతుల"** వల్ల నవతరానికి ఎంతో మేలు జరుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. 2007 నవంబరు 16వ తేదీన 'సాల్మియా' లోని మదర్సా నజాత్‌లో జరిగిన **'15వ సమ్మర్ ఇస్లామిక్ క్లాసెస్'** బహుమతి ప్రదానోత్సవ సందర్భంగా పలువురు వక్తలు IMA కృషిని శ్లాఘించారు. ఈ కార్యక్రమానికి **హామిద్ సాల్హ్ అబ్దలీ** ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమ్మర్ క్లాసెస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ **జనాబ్ ఖలీలుల్లాహ్ ఖాన్,** (IMA) అధ్యక్షులు **జనాబ్ ముహమ్మద్ అస్లం,** స్కూల్ ప్రిన్సిపాల్ **జనాబ్ సయ్యిద్ అహ్మద్ అలీ** ప్రభృతులు వేదికనలంకరించిన వారిలో వున్నారు.

ఇండియన్ ముస్లిం అసొసియేషన్ సంస్థ గత 15 సంవత్సరాలుగా ఏటేటా **IPC** సహకారంతో కువైట్‌లో **"వేసవి శిక్షణా శిబిరం"** నిర్వహించి బాలబాలికల్లో ధార్మికతను, నైతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తోంది. రెండు మాసాలపాటు జరిగే ఈ శిక్షణా తరగతులలో బాలలకు శాస్త్రోక్తంగా ఖుర్‌ఆన్ చదవటం నేర్పుతారు. ఖుర్‌ఆన్ సూరాలు కంఠస్థం చేయిస్తారు. సీరత్, ఫిఖ్‌హ్ పట్ల అవగాహనను పెంచేందుకు ప్రత్యేక తరహాలో పాఠాలు చెబుతారు. ఈ ఏడాది 200 మంది విద్యార్థులు ఈ శిబిరం ద్వారా లబ్ధి పొందారు.

ఈ సందర్భంగా జరిగిన బాలల విద్యావిన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ తరగతులు విజయవంతంగా సాగటానికి సహకారమందించిన అధ్యాపకవర్గానికి, పేరెంట్స్‌కి IMA కృతజ్ఞతలు తెలుపుకుంది.





భగవంతుని కుమారుడా ఏసు? (ఈసా)

విగ్రహాలని పగులగొట్టి, రూప చిత్రాలని తుడిచివేయటమే గాక, ఈ మహా ప్రవక్త చేసిన గొప్ప విప్లవ కార్యం... ఆ కాలంలో ఉన్నటువంటి ఇంకొక బలీయమయిన నమ్మకాన్ని కూడా ఈయన ఖండించారు.

తండ్రి....

కుమారుడు...

పరిశుద్ధాత్మ...

అను ఈ మూడింటిలో పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండటమే క్రైస్తవ మత తత్వము – అదే క్రీస్తు మతము.

పాపులను రక్షించడానికి – మానవుల పాపములను తానే మోసి, యాతనలనుభవించి, సిలువవెయ్యబడి, హింసకు లోనై మరణించి, మూడవ రోజున తిరిగి బ్రతికి, పరమ పితకు కుడి భాగాన సింహాసనారూఢుడయ్యాడు – అని క్రైస్తవుల విశ్వాసము.

1. ఏసు – భగవంతుని కుమారుడు.
2. ఆయన మరణంలోనించి తిరిగి జీవం పొందారు.

– ఈ రెంటినీ విశ్వసించినివారు, క్రైస్తవులు అవటానికి సాధ్యం కాదు – అవలేరు.

ఈ రెండు విశ్వాసాల ఆధారంగా క్రీస్తుమతము ప్రబలంగా స్థిరపడి పోయిన కాలంలో, మహా నాయకుడయిన ప్రవక్త ఈ సిద్ధాంతాలని తిరస్కరించారు.

ఏసు భగవంతుని కుమారుడు కాదు.

దివ్య దూత – దైవ ప్రవక్త.

క్రైస్తవ మతంలోని – ' దీర్ఘదర్శకులు ' అని పిలువబడినవారు ఇస్లామ్ లో ' ప్రవక్తలు ' – అని పిలువబడుతున్నారు. వారి వారి పేర్లలో కొద్దిగా తప్ప మార్పులు లేవు.

ఆదమ్ (ఆదామ్) ఇస్మాయీల్ (ఇష్మయేల్) యాకూబ్ (యాకోబ్) మూసా (మోజెస్) దావూద్ (దావీదు) యూనుస్ (యోనా) జకరియ్యా (జకరయ్య) ఇబ్రాహీమ్ (అబ్రహామ్) ఇస్హాక్ (ఈసాక్) యూసుఫ్ (యోసోబ్) హారూన్ (ఆరోన్) సులైమాన్ (సాలమన్) ఇల్యాస్ (ఎలియా)

– ఈ విధంగానే ఏసుని ఈసా అని... ముస్లింలు పిలుస్తూంటారు.

అదేకాదు – వారు ఆయన ఒక ప్రవక్త, దైవసందేశహరుడన్న సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు.

క్రైస్తవ మతస్తులకీ, ఇస్లామీయుల మత విశ్వాసాలకీ మధ్య గల వాద ప్రతివాదాల గురించి ఇక్కడ చర్చించటం నా అభిమతం కాదు. నేను దీన్నంతటినీ వేరే దృష్టితో చూస్తున్నాను. ఆనాడు దృఢంగా, లోతుగా పాతుకుపోయిన ఒకానొక సిద్ధాంతం మత విశ్వాసం, అంతకంటే బలమైన వాదంతో తునాతునకలుగా ఖండించబడినది, తిరస్కరించబడినది.

తప్పుడు వాదం తిరస్కరించబడినదే తప్ప ఈసా (ఏసు) ప్రవక్తకి ఏ విధమయిన నిరాదరణగాని, న్యూనతగాని ఆపాదించడం జరగలేదు:

పరిశుద్ధ ఆత్మ ద్వారా ఈసా (అస్సలాం)కు బలం చేకూర్చడం జరిగింది.

ఆయన ద్వారానే ఒక పవిత్ర గ్రంథం ఇంజీల్ (బైబిల్) ప్రసాదించబడినది.

అన్నదంతా అల్ కితాబ్ (దివ్య ఖుర్ఆన్) మిక్కిలి గౌరవించి ప్రస్తావించింది.

అదే మాదిరి ఇతర మతములలోని సిద్ధాంతాలని ఖండించినప్పటికీ మనిషి సాటి మనిషికి చూపవలసిన మర్యాద మన్ననలు ఆయా ధార్మిక వ్యక్తిత్వాలకు తప్పక చూపవలసిన కనీస కర్తవ్యం అని అగ్రజులు నిబంధన ఏర్పరచారు.

మరొక మతానికి చెందిన ఒక వ్యక్తి మరణించగా, ఆ మృతదేహాన్ని తీసుకువెడుతున్నప్పుడు, ఆ అంతిమ యాత్రలో ముందు నడిచి మృత కళేబరం పట్ల చూపవలసిన మర్యాదను అభిమానాన్ని వెల్లడించారు అగ్రజులు.

తప్పుడు భావనల ఖండన వేరు.
వ్యక్తిత్వాలకు ఇచ్చే మర్యాద వేరు.

ఈ రెంటినీ – కలగాపులగం చెయ్యకుండా, సమాన దృష్టితో, చూడగలిగిన తులామాన సదృశమయిన ఒక విశాల న్యాయ దృక్పథాన్ని ఇచ్చిన వ్యక్తి, మానవులలో తలమానికం వంటివారు – అగ్రజులు.

ఎమర్జన్సీ కాలంలో **'మీసా'** (MISA) కారణంగా నేను నిర్బంధానికి లోనయి పక్క మీద పడుకునే చాలా రోజులు గడిపాను. ఆ సమయంలో ప్రపంచంలోని అన్ని మతాలని, వాటి విధానాలని, ఆ మతాలలోని మూల అర్థాలని, సూక్ష్మ భావాలని మిక్కిలి శ్రద్ధతో అధ్యయనం చేశాను.

మా కుటుంబంలోనివారు – పాపం ఎక్కడెక్కడో తిరిగి ఆయా మత గ్రంథాలన్నిటినీ సేకరించి తీసుకొచ్చి ఇచ్చారు. అందులో కొన్ని గ్రంథాలు నా ముస్లిమ్ స్నేహితులు (ముస్లిమ్‌లు అని పిలువబడు ముస్లిమ్‌లు) తమ స్వంత ఖర్చుతో కొని తీసుకొచ్చి ఇచ్చారు.

ఆ మత గ్రంథాలని, వాటిలో నిగూఢమై ఉన్న విషయాలని చదివి ఆకళింపుచేసుకున్న వెనుక, వాటన్నిటిలోకి నా హృదయాన్ని అయస్కాంతం వలె పట్టి లాక్కున్న గ్రంథం – " అల్ ముతహ్హరా " అయిన – అల్ ఖుర్ఆన్ ఒక్కటే.

(**'నేను ఆరాధించే ఇస్లాం'** పుస్తకం నుండి)

PAGE 18-19.pdf 1/9/08 8:38:52 PM

భ్రమల సమయం - 2

– సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

(నవంబర్ సంచిక తరువాయి)

"బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్" కి బదులు **'786'** అని వ్రాసుకునే రివాజు ముస్లింలలో (భారత దేశం, బంగ్లాదేశ్, పాకిస్తాన్లలో) చాలా కాలం నుండి కొనసాగుతూ వస్తూ ఉంది. ఈ రివాజు రుజుమార్గానికి పూర్తిగా విరుద్ధం. ఖుర్ఆన్ లాంటి పవిత్ర గ్రంథంతో పరిహాసం లాంటిది. దివ్య ఖుర్ఆన్ లెక్కల పుస్తకం కాదు. అరబీ భాషలో అవతరింపజేయబడిన అంతిమ దైవ గ్రంథం అది. దివ్య వచనాలను సంఖ్యలో మార్చి వ్రాయడం ఘోరాతి ఘోరమైన పాపం. మరో విధంగా చెప్పాలంటే–, ఇలా వ్రాయడం 'పవిత్ర ఖుర్ఆన్' ని అపమానపర్చడమే అవుతుంది. 'అక్కడెక్కడో పవిత్ర ఖుర్ఆన్ని అపవిత్ర పర్చారు' అని నిప్పులు చెరిగే మనం– మన సమాజంలోనే ఖుర్ఆన్ ఇన్ని విధాలుగా అగౌరవపర్చబడుతుంటే చేతులు ముడుచుకుని కూర్చున్నామే! ఈ నిర్లిప్తతని ఏమని వర్ణించాలో మీరే చెప్పండి.

"నా దగ్గర అతి ముఖ్యమైన ఒక ఉత్తరం విసిరేయబడింది. ఇది సులైమాన్ దగ్గర్నుంచి వచ్చింది. అది **'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్'** తో ప్రారంభించబడింది." (నమల్: 31)

ఈ ఆయతు దృష్ట్యా ముస్లింల వద్ద ఏ కార్యం ప్రారంభించినా **'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్'** చెప్పడం వ్రాయడం శుభకార్యంగా భావించ బడుతుంది. అయితే మితిమీరిన పోకడలకు పాల్పడే చదువుకున్న కొందరు – 'బిస్మిల్లాహ్' లో అల్లాహ్ పేర్లు ఉన్నాయి గనక ప్రజలు ఉత్తరాన్ని ఎక్కడ పడితే అక్కడ పడేస్తారని, అలా అల్లాహ్ నామం అపవిత్రం అవుతోంది అని ఈ '786' సంఖ్యను బాగా ఒంటబట్టించుకున్నారు. ఇది చూసి ముస్లింలలోని సామాన్యులు, ముస్లిమేతర మేధావులు, రచయితలు, సినీ దర్శకులు సైతం '786' ను ముస్లింల పవిత్ర సంఖ్యగా భావించారు. ఇక్కడ చదువుకున్న ముస్లిం సోదరులు గమనించవలసిన విషయం ఏమిటంటే–, 'హుదైబియా ఒప్పందం' సందర్భంగా దైవ ప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి) గారి చేత వ్రాయించిన ఒప్పందాన్ని **'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్'**తో ప్రారంభించారు. 'రహ్మాన్' అనే పేరుని మేము ఎరుగము అని బహుదైవారాధకులు పేచీపెడితే–, 'బిస్మిల్లాహ్' అని వ్రాయించారు. (బుఖారీ, ముస్లిం)

హిజ్రీ శకం 7వ సంవత్సరం చివర్లో దైవ ప్రవక్త (స) రాజులు, తెగ నాయకుల పేర ఇస్లాం సందేశాన్ని అందజేస్తూ వ్రాసి పంపిన ఉత్తరాలన్నింటినీ 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్' తోనే ప్రారంభించారు.

హిజ్రీ శకం 7వ సంవత్సరంలో దైవ ప్రవక్త (స) అబిసీనియా, ఈరాన్, ఈజిప్టు, రోము, అమ్మాన్ చక్రవర్తుల పేరిట వ్రాసి పంపిన ఉత్తరాల్లో వారందరినీ ఇస్లాం ధర్మం వైపునకు ఆహ్వానించారు. వారిలోని కొందరు ఉత్తరం చదివిన వెంటనే ఇస్లాం స్వీకరించారు. మరికొందరు బహుమతులు అందజేశారు. ఈరాన్ రాజు ప్రవక్త (స) గారి ఉత్తరాన్ని చించి పారేశాడు. ఆ తర్వాత అతడి రాజ్యం సైతం ముక్కలయ్యింది అనుకోండి. అది వేరే విషయం. ముఖ్యంగా చెప్పవచ్చిందేమిటంటే–, దైవ ప్రవక్త ప్రతీ ఉత్తరాన్ని **'బిస్మిల్లాహ్'** తోనే ప్రారంభించేవారు. అల్లాహ్ పేరుతోనే ముగించేవారు. సుబ్హానల్లాహ్! దైవ ప్రవక్త (స) గారికి బాగా తెలుసు – తాను వ్రాసే లేఖలు వారి చేతుల్లోకి వెళతాయని.

"బహుదైవారాధకులు అపవిత్రులు (ఏకేశ్వరారాధనకు వ్యతిరేకమైన విశ్వాసం, ఆచారాలు, నడపడికలు కలవారు) గనక ఈ సంవత్సరం తరువాత వారిని (అంధ విశ్వాసాలు, మూఢాచారాలు ఇకపై ఇక్కడ కొనసాగించడానికి వీల్లేదు కనుక) ప్రతిష్ఠాలయం (కాబా గృహం) దరిదాపులకు రానివ్వకండి." (తౌబా: 28) అన్న దైవాజ్ఞను అందరికన్నా బాగా తెలిసినవారు దైవ ప్రవక్తే. ఆయనపైనే గదా దైవ గ్రంథం ఖుర్ఆన్ అవతరించింది!

దైవ ప్రవక్త (స) గారి సహచరులు ఉత్తరాలు వ్రాసినప్పుడల్లా **'బిస్మిల్లాహ్...'** తోనే ప్రారంభించేవారు. హజ్రత్ ఉమర్ (రజి) గారు నైలు నది పేర ఉత్తరం వ్రాసి పంపినప్పుడు ప్రారంభంలో **'బిస్మిల్లాహ్...'** అని వ్రాశారు.

(అల్ జమాల్–వల్ కమాల్)

అంటే–, అల్లాహ్ క్షమించుగాక! వారికి అల్లాహ్ను ఎలా గౌరవించాలో కూడా తెలియదా? **"ఎవరు అల్లాహ్ నిర్ణయించిన ధార్మిక చిహ్నాలను గౌరవిస్తారో వారి హృదయాలలో ఇది దైవ భీతికి నిదర్శనం అవుతుంది."** (హజ్జ్: 32) అన్న దైవాజ్ఞలోని పరమార్థం వారు ఎరుగరా?

సరే, మీరు ఎప్పుడైనా ఆలోచించారా? 'బిస్మిల్లాహ్...'కి సంఖ్య రూపం ఎంత వస్తుందో! లేదా 'బిస్మిల్లాహ్...'కి సంఖ్య రూపం ఇవ్వడం యూదులను అనుసరించడం అవుతుందని ఏనాడైనా యోచించారా!? ఉదయం, సాయంత్రం విగ్రహారాధకులు పూజించే ఓ విగ్రహం పేరుకి ఇది సంఖ్య రూపం అని మీకు తెలుసా? లేదు అంటే... రండీ.... వచ్చే సంచికలో తెలుసుకుందాం!

"ఇది కాంచక్రర్య ఎగుళ్ళు దిగుళ్ళు
వాటిని మేము మనుషుల మధ్య క్రియ్యతరా ఉంటాము." (3:140)

నూతన సంవత్సర శుభాకాంక్షలు !

క్రీ. శ. 2008 హిజ్రీ శకం 1429



ఇస్లాం ప్రజెంటేషన్ కమిటీ, కువైట్

IPC
Ext. 110 2444117
www.thelastingmiracle.com


لاَ تَقْنَطُوا مِن رَّحْمَةِ اللّهِ
అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి.

قال رسول الله ﷺ:

لا تزول قد ما عبد حتى يسأل

మహనీయుడు ముహమ్మద్ ప్రవక్తసాహెబ్ ఎలాంటి వచనాలు చెప్పారు:

అయిదు విషయాల లెక్క తీసుకోబడనంతవరకూ దానుడు, దేవుని న్యాయస్థానం నుండి అడుగు ముందుకు వేయలేడు. అతనితో ఇలా ప్రశ్నించటం జరుగుతుంది:

1 | عن عمره فيما أفناه
నీ వయసును (జీవితం) ఎలాంటి ఆచరణలలో గడిపావు?

2 | وعن علمه فيما فعل
నీవు తెలుసుకున్న జ్ఞానాన్ని ఎంతవరకు ఆచరించావు?

3 | وعن ماله من اين اكتسبه
ధనం ఎలా సంపాదించావు?

4 | وفيما أنفقه
ఎక్కడ ఖర్చు చేశావు?

5 | وعن جسمه فيما أبلاه
నీ శరీరాన్ని ఏ పనులలో నిమగ్నం చేశావు?



జీవన యాత్ర సాగించే ఓ బాటసారీ!
నీ ఆనలు గమ్యస్థానం పరలోకం!!
నీవు ఇక్కడ సంపాదించటానికి వచ్చావు.
ఆ సంపాదన ఏదై ఉండాలో, నీ గమ్యమెక్కడో నీకు సదా గుర్తుండాలి సుమా!

IPC
ISLAM PRESENTATION COMMITTEE
رحمة للعالمين ...
Ext. 110 2444117
www.thelastingmiracle.com